విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :175 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 10 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధం

- దేశద్రోహి' ఆరోపణలపై రాహుల్ ఫైర్..
- మోదీకి బహిరంగ చర్చకు సవాల్!
- 'ఎవరూ దేశద్రోహులు? విదేశీ శక్తుల చేతుల్లో ఉన్నదెవరు?'
- ఏ సమయంలోనైనా.. ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధం
- జవాన్లు ప్రధాని వ్యాఖ్యలను నమ్మలేదంటూ రాహుల్ వ్యాఖ్యలు



డీలిమిటేషన్ బిల్లు కోసమే పార్లమెంట్ ప్రొరోగేషన్ ఆలస్యం

- బీజేపీపై కాంగ్రెస్ ఫైర్!
- 88 రోజులైనా ప్రొరోగ్ కాని పార్లమెంట్ సమావేశాలు
- మోదీకి ఖర్గే నాలుగు లేఖలు రాసినా స్పందన లేదు
- అమిత్ షాకు సమయం ఇచ్చేందుకే జాప్యమంటూ జైరాం రమేశ్ ఆరోపణ

అభివృద్ధికి ప్రజామోదమే ఈ విజయం

- అందరికీ కృతజ్ఞతలు: చంద్రబాబు
- స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభంజనం
- 2024తో పోలిస్తే పెరిగిన ప్రజాదరణ
- 100 పట్టణ స్థానిక సంస్థల్లో 94 చోట్ల విజయం
- వైఎస్సార్సీపీపై సీఎం విమర్శలు



అమరావతి

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్సీపీని మరింతగా తిరస్కరించి, కూటమికి ఘన విజయాన్ని అందించారని తెలుగుదేశం అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పట్టణాలు, పల్లెలు, అన్ని వర్గాల ప్రజలు కూటమికి ఒకే విధమైన మద్దతు పలికారని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో జరిగిన ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించారని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థులకు విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలందరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. రెండున్నరేళ్ల పాలనలో అభివృద్ధి, సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదమే ఈ ఫలితాలని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల ఫలితాలపై నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే కూటమికి ప్రజాదరణ మరింత పెరిగిందని చెప్పారు. కేడర్ బేస్ పార్టీ టీడీపీ అని, సేవాభావమే తమ రాజకీయ విధానమని వివరాలు 2లో..



ప్రధాని మోదీతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కీలక ఫోన్ సంభాషణ

- చర్చలు మరియు దౌత్య మార్గాల ద్వారానే సమస్య పరిష్కారమవుతుందని స్పష్టం చేసిన పీఎంఓ
- శాంతి స్థాపనకు అవసరమైన అన్ని చర్యలకు సహకరించేందుకు భారత్ సిద్ధమని వెల్లడి
- యుద్ధాన్ని ముగించేలా ఇతర దేశాల నేతలతో భారత్ చర్చలు జరపాలని కోరిన జెలెన్స్కీ
- ఆహార భద్రత, ఇంధన రక్షణపై అన్ని పక్షాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు జైశంకర్ స్పష్టీకరణ

పదేళ్లలోనే పెను మార్పు.. భారత్‌పై ప్రపంచ బ్యాంకు ప్రశంసలు



- 27.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గిన పేదరికం
- తీవ్ర పేదరికం నుంచి బయటపడిన 49.6 కోట్ల మంది
- భారత్ పురోగతిని ప్రశంసించిన ప్రపంచ బ్యాంకు
- పేదల్లో 57 శాతం మంది ఉత్తర, తూర్పు ప్రాంతాల్లోనే
- 2.24 లక్షల కోట్ల డాలర్లకు చేరిన కుటుంబాల ఖర్చు

వాయిదాల వలయంలో కృష్ణా, గోదావరి బోర్డులు!


- ఆరుసార్లు వాయిదా పడిన కేఆర్ఎంబీ భేటీ
- 20 నెలలుగా జీఆర్ఎంబీ సమావేశం లేదు
- పరిష్కారానికి నోచుకోని కీలక జల సమస్యలు



హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నదీ జలాల వివాదాలకు పరిష్కారం చూపాల్సిన కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల సమావేశాలు వాయిదాల పర్వంగా మారాయి. కీలక సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సిన భేటీలు పదేపదే వాయిదా పడుతుండటంతో జల వివాదాల పరిష్కారం మరింత జాప్యమవుతోంది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 21వ సమావేశం ఏకంగా ఆరుసార్లు వాయిదా పడగా, గోదావరి నదీ యాజమాన్య బోర్డు వివరాలు 2లో..

88 రోజులుగా ప్రొరోగ్ కాని పార్లమెంట్!



- 18 ఏళ్ల రికార్డు బద్దలు..
- 2008 నాటి 87 రోజుల రికార్డు బద్దలు
- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల కోసమేనా జాప్యం?
- ప్రొరోగేషన్‌పై రాజ్యాంగంలో నిర్దిష్ట గడువు లేదు

ఏపీ సీపీఎస్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్



ఓపీఎస్‌లోకి మారే అవకాశం!

- అర్హులకు వన్‌టైమ్ ఆప్షన్
- డిసెంబర్ 31లోగా దరఖాస్తు
- జీవో 158 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలో ఉన్న వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. అర్హులైన ఉద్యోగులు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)లోకి మారేందుకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్ జీవో ఎంఎస్ నంబర్ 158ను విడుదల చేశారు. 2026 జూలై 13న జారీ చేసిన జీవో 53కు అనుగుణంగా ఈ ప్రక్రియను పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు సమగ్ర వివరాలు 2లో..



ఎర్రకోట పేలుడు తర్వాత ఉగ్రవాదంపై ఉక్కుపాదం

- ఏడాదిలో 300 మందికి పైగా అరెస్టు
- విదేశాల నుంచి 73 మంది మోస్ట్ వాంటెడ్ నిందితుల అప్పగింత
- 'ప్రహార్' వ్యూహంతో నెట్‌వర్క్‌లపై నిఘా
- 'ప్రహార్'తో ఉగ్రవాదంపై ప్రత్యేక వ్యూహం

ఏపీఎండీసీకి ప్రభుత్వం భారీ ఊరట

- మరో రూ.115 కోట్ల అదనపు గ్యారంటీ!
- బొగ్గు గనుల వేలంలో మరింత చురుగ్గా పాల్గొనేందుకు అవకాశం
- రుణ గ్యారంటీ పరిమితి రూ.1,021.52 కోట్లకు పెంపు
- అదనపు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

APMDC
dhra Pradesh Mine
Development Corp

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో మైనింగ్ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)కి మరో రూ.115 కోట్ల అదనపు ప్రభుత్వ గ్యారంటీని మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా నిర్వహించే బొగ్గు గనుల వేలంలో సంస్థ మరింత చురుగ్గా పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ వివరాలు 2లో..

అభివృద్ధికి ప్రజామోదమే ఈ విజయం

-మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. రాజకీయాల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ కూటమిగా కలిసి పనిచేశామని, అన్ని జిల్లాల్లోనూ ప్రజలు తమకు మద్దతు పలికారని తెలిపారు. అనకాపల్లి, కోనసీమ, కాకినాడ, పల్నాడు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల్లో వైఎస్సార్సీపీకి ప్రజా మద్దతు లభించలేదని వ్యాఖ్యానించారు. విధ్వంస పాలన నుంచి రాష్ట్రాన్ని పునరుద్ధరించే లక్ష్యంతో స్వర్ణాంధ్ర విజన్‌ను రూపొందించి అభివృద్ధి, సుపరిపాలన కోసం కృషి చేస్తున్నామని వివరించారు.

2024తో పోలిస్తే పెరిగిన ప్రజాదరణ

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజాదరణ పెరిగిందని ఓట్ల శాతమే స్పష్టం చేస్తోందని చంద్రబాబు తెలిపారు. పట్టణ, పరిషత్ ఎన్నికల్లో కలిపి కూటమి 58.9 శాతం ఓట్లు సాధించిందని వెల్లడించారు. 2024 ఎన్నికల్లో వచ్చిన 55.3 శాతం ఓట్లతో పోలిస్తే ఆదరణ పెరిగిందని వివరించారు. స్థానిక ఎన్నికల్లో కూటమికి, వైఎస్సార్సీపీకి మధ్య ఓట్ల శాతంలో 25.34 శాతం వ్యత్యాసం ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఎన్డీఏకు 59.9 శాతం, వైఎస్సార్సీపీకి 34.3 శాతం ఓట్లు వచ్చాయని, కూటమి స్ట్రైక్ రేట్ 94 శాతంగా నమోదైందని చెప్పారు. జడ్పీటీసీ ఎన్నికల్లో ఎన్డీఏ 57.6 శాతం, వైఎస్సార్సీపీ 39.7 శాతం ఓట్లు సాధించాయని తెలిపారు. పట్టణాల్లో కూటమి, వైఎస్సార్సీపీ మధ్య ఓట్ల శాతం వ్యత్యాసం 25.60 శాతం కాగా, గ్రామీణ ప్రాంతాల్లో 17.9 శాతంగా ఉందన్నారు. మొత్తం 9,818 ఎంపీటీసీ స్థానాలకు గానూ కూటమి 7,803 స్థానాలను గెలుచుకుందని, రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం మండల అధ్యక్ష స్థానాలను దక్కించుకుందని వెల్లడించారు.

27 జిల్లాల్లో కూటమి ఆధిక్యం

మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు గానూ కూటమి 575 స్థానాలను గెలుచుకుందని చంద్రబాబు తెలిపారు. 28 జిల్లాల్లో 27 చోట్ల ఆధిక్యత సాధించిందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రమే వైఎస్సార్సీపీ కూటమి కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకుందని చెప్పారు. ఏడు జిల్లాల్లో వైఎస్సార్సీపీకి ఒక్క జడ్పీటీసీ స్థానం కూడా దక్కలేదని వివరించారు. పట్టణాల్లో ఎన్డీఏకు 65.7 శాతం, వైఎస్సార్సీపీకి 27.42 శాతం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వచ్చాయని తెలిపారు. పరిషత్ ఎన్నికల్లో కూటమికి 62.83 శాతం, వైఎస్సార్సీపీకి 31.46 శాతం ఓట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. అనకాపల్లి, కోనసీమ, కాకినాడ, మార్కాపురం, పల్నాడు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల్లో వైఎస్సార్సీపీ ఖాతా తెరవలేదని చంద్రబాబు వెల్లడించారు.

పెట్టుబడులు, అభివృద్ధికి ప్రాధాన్యం

పెట్టుబడులను ఆకర్షించేలా ఎస్ఐపీబీ, కేబినెట్ సమావేశాల ద్వారా వేగంగా అనుమతులు మంజూరు చేశామని చంద్రబాబు తెలిపారు. వివిధ శాఖల ప్రగతి నివేదికలను ప్రజల ముందు ఉంచామని చెప్పారు. రాయలసీమను అభివృద్ధి సీమగా మార్చే లక్ష్యంతో నీటిని అందించడంతో పాటు పరిశ్రమలను తీసుకొస్తున్నామని వివరించారు. సూపర్ ఎల్‌నినో వంటి తీవ్ర కరవు పరిస్థితుల్లోనూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కరవు, కోస్తాంధ్రలో తుపాన్ల వంటి ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పటికీ సాంకేతిక పరిజ్ఞానంతో ముందస్తు అంచనాలు వేసి ప్రజలకు హెచ్చరికలు జారీ చేశామని చెప్పారు. ప్రజలకు కష్టం వచ్చినప్పుడు ప్రభుత్వం అండగా నిలిచిందని, అందుకే ఎన్నికల్లో ప్రజలు కూటమికి మద్దతు పలికారని పేర్కొన్నారు.

మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం

టీడీపీ తరఫున మేయర్లు, వైస్‌పర్సన్లుగా గెలిచిన 70 మందిలో 55 మంది డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగినవారని చంద్రబాబు తెలిపారు. వీరిలో 42 మంది మహిళలు ఉండగా, 44 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందినవారని చెప్పారు. టీడీపీ గెలుచుకున్న పది మేయర్ పదవుల్లో ఎనిమిది మంది మహిళలే ఉన్నారని వివరించారు. రాజకీయాల్లో తాము చేసిన ప్రయోగాలు మంచి ఫలితాలనిచ్చాయని, ఈ నాయకత్వం భవిష్యత్తులో మరో 30 ఏళ్లకు సరిపడే నాయకులను అందిస్తుందని అన్నారు.

పట్టణ స్థానిక సంస్థల్లో కూటమి హవా

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించిందని చంద్రబాబు తెలిపారు. 100 స్థానాలకు గానూ 94 చోట్ల విజయం సాధించి, 82 శాతం వార్డులను కైవసం చేసుకుందని వెల్లడించారు. మొత్తం 3,941 వార్డుల్లో 3,233 స్థానాలను గెలుచుకున్నామని, 13 మేయర్ పదవులకు గానూ 12, 87 చైర్‌పర్సన్ పదవులకు గానూ 82 దక్కించుకున్నామని చెప్పారు. టీడీపీ 70, జనసేన 20, బీజేపీ నాలుగు చొప్పున మేయర్, చైర్‌పర్సన్ పదవులను సాధించాయని వివరించారు. 100 పట్టణ స్థానిక సంస్థల్లో 95 చోట్ల కౌన్సిల్ మెజారిటీ సాధించామని, 16 పట్టణ స్థానిక సంస్థల్లో అన్ని వార్డులనూ కూటమి గెలుచుకుందని తెలిపారు. అనంతపురం మేయర్ అభ్యర్థి ఓడిపోయినప్పటికీ కార్పొరేటర్లలో కూటమి బలం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు.

పులివెందులలోనూ కూటమి విజయధంకా

విశాఖలో 2,47,817, విజయవాడలో 1,30,872, గుంటూరులో 96,294 ఓట్ల మెజారిటీ సాధించామని చంద్రబాబు వెల్లడించారు. వైఎస్సార్సీపీ 100 పట్టణ స్థానిక సంస్థలకు గానూ కేవలం నాలుగు చోట్లే గెలిచిందని, 13 మేయర్ పదవుల్లో ఒక్కటి మాత్రమే దక్కించుకుందని చెప్పారు. మొత్తం 3,941 వార్డుల్లో 558 స్థానాలకే పరిమితమైందని, 22 పట్టణ స్థానిక సంస్థల్లో ఒక్క వార్డును కూడా గెలుచుకోలేకపోయిందని తెలిపారు. పులివెందులలో కూటమి 13,875 ఓట్ల మెజారిటీతో చైర్‌పర్సన్ పదవిని దక్కించుకుందని, 40 వార్డులకు గానూ 37 స్థానాలను గెలుచుకుందని వివరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరగడం వల్లే ఈ ఫలితాలు వచ్చాయని అన్నారు. కడప జిల్లాలో రౌడీ రాజకీయం అంతమైందని, అక్కడి తొమ్మిది పట్టణ స్థానిక సంస్థలూ కూటమి ఖాతాలో చేరాయని వ్యాఖ్యానించారు.

యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఏపీకి రెండో స్థానం

ప్రతి ప్రాంతానికి, ప్రతి వర్గానికీ అభివృద్ధి ఫలాలు అందుతున్నాయనడానికి యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఏపీ సాధించిన స్థానమే నిదర్శనమని చంద్రబాబు తెలిపారు. 2026 సూచీలో 28 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచిందన్నారు. జీవన ప్రమాణాలు, సామాజిక-ఆర్థిక భద్రత, మౌలిక వసతులు, విద్య, వైద్యం వంటి రంగాల్లో ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందుతున్నాయని వివరించారు. కుటుంబ స్థాయి నుంచి కమ్యూనిటీ ఆస్తుల వరకు పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాల నిర్మాణంలో ఏపీ ముందంజలో ఉందన్నారు.

వైఎస్సార్సీపీ హింసాత్మక రాజకీయాలపై విమర్శలు

హింస, దాడులు, హిట్ అండ్ రన్ రాజకీయాలతో ప్రజాతీర్పును మార్చలేరని చంద్రబాబు వైఎస్సార్సీపీపై విమర్శలు గుప్పించారు. 'గొడ్డలి పార్టీ' రాజకీయాలకు కాలం చెల్లిందని వ్యాఖ్యానించారు. విశాఖకు తమ ప్రభుత్వం అభివృద్ధి వెలుగులు తీసుకొస్తే, మేయర్ స్థానంలో 2.50 లక్షల ఓట్ల మెజారిటీతో ప్రజలు కూటమిని గెలిపించారని అన్నారు. ప్రజల కోసం కష్టపడే పార్టీల వెంటే ప్రజలు ఉంటారని ఈ ఎన్నికలతో మరోసారి నిరూపితమైందని చెప్పారు. కీలకమైన స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు వైఎస్సార్సీపీ అన్ని విధాలా ప్రయత్నించిందని చంద్రబాబు ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్ఐఆర్ ప్రక్రియ, డీలిమిటేషన్‌పై పిటిషన్లు వేసిందని, అయితే సుప్రీంకోర్టు వారి ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసిందని పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ నేరాలు, ఘోరాలు, హింసాత్మక రాజకీయాలనే నమ్ముకుందని విమర్శించారు. రౌడీ రాజకీయాలు, డ్రామాలతో ప్రజాతీర్పును మార్చలేరని అన్నారు. రెండు తుపాన్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ వైఎస్సార్సీపీ కనీసం రాజకీయ పార్టీగా స్పందించలేదని చంద్రబాబు విమర్శించారు. తాము ఎన్నికల కంటే తుపాన్లు, ప్రజా సమస్యలపైనే ఎక్కువ దృష్టి పెట్టి పనిచేశామని తెలిపారు. ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలనే ఉద్దేశంతోనే ఓటర్లు కూటమికి మద్దతు పలికారని చెప్పారు. రాజకీయ పార్టీలకు ప్రజల దీవెనల కంటే గొప్ప బహుమతి మరొకటి ఉండదని వ్యాఖ్యానించారు.

వాయిదాల వలయంలో కృష్ణా, గోదావరి బోర్డులు!

-మొదటిపేజీ తరువాయి

(జీఆర్ఎంబీ) సమావేశం కూడా పలుమార్లు వాయిదా పడింది. దీంతో రెండు నదులకు సంబంధించిన కీలక అంశాలపై చర్చలు ముందుకు సాగడం లేదు.

వాయిదాల వలయంలో సమావేశాలు

రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ, ప్రాజెక్టుల నిర్వహణ, టెలిమెట్రీ వ్యవస్థల ఏర్పాటు వంటి కీలక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన బోర్డుల సమావేశాలే నిర్వహణకు నోచుకోవడం లేదు. భేటీల నిర్వహణకు నిర్ణయాలు తీసుకుంటున్నా, వివిధ కారణాలతో వాయిదాలు పడుతుండటంతో జల వివాదాలపై అనిశ్చితి కొనసాగుతోంది.

ఆరుసార్లు వాయిదా పడిన కేఆర్ఎంబీ భేటీ

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు 21వ సమావేశం నిర్వహణలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. తొలుత మే నెలలో నిర్వహించాలని నిర్ణయించిన ఈ సమావేశం ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం కారణంగా వాయిదా పడింది. అనంతరం ఆగస్టు, అక్టోబర్ నెలల్లో నిర్వహించాల్సిన భేటీలు కూడా జరగలేదు. అక్టోబర్ 26న సమావేశం జరగాల్సి ఉండగా, తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణ అంశంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రితో రాష్ట్ర ప్రభుత్వ సమావేశం ఉన్నందున వాయిదా పడింది. మరుసటి రోజు నిర్వహించాల్సిన భేటీ కూడా జరగలేదు. ఆ తర్వాత నవంబర్ 5న జరగాల్సిన సమావేశం సైతం వాయిదా పడింది. మురను తుపాను ప్రభావంతో అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నందున సమావేశాన్ని వాయిదా వేయాలని ఏపీ కోరగా, బోర్డు అంగీకరించింది. ఇలా కేఆర్ఎంబీ 21వ సమావేశం ఆరుసార్లు వాయిదా పడినట్లు సమాచారం.

పూర్తిస్థాయి భేటీకి 22 నెలల విరామం

కృష్ణా బోర్డు పూర్తిస్థాయి సమావేశం చివరిసారిగా 2025 జనవరి 21న జరిగింది. అదే ఏడాది జూన్ 27న ఉద్యోగుల వేతనాల రికవరీకి సంబంధించి హైకోర్టు తీర్పుపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశం మాత్రమే నిర్వహించారు. అయితే అది పూర్తిస్థాయి సమావేశం కాదు. దీంతో కీలక జల సమస్యలపై సమగ్రంగా చర్చించేందుకు బోర్డు భేటీ జరగక చాలాకాలం గడిచింది.

20 నెలలుగా జీఆర్ఎంబీ సమావేశం లేదు

కృష్ణా బోర్డు తరహాలోనే గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశాలు కూడా వాయిదాల బాట పట్టాయి. జీఆర్ఎంబీ



18వ సమావేశాన్ని తొలుత ఆగస్టు 18న నిర్వహించాలని నిర్ణయించారు. అయితే తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలు వ్యక్తం చేయడం, అజెండా అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు తలెత్తడంతో సమావేశం వాయిదా పడింది. ఆ తర్వాత అక్టోబర్ 30న నిర్వహించాల్సిన భేటీ కూడా మరోసారి వాయిదా పడింది.

జీఆర్ఎంబీ సమావేశం చివరిసారిగా 2025 ఏప్రిల్ 7న జరిగింది. ఆ తర్వాత ఇప్పటివరకు మరో సమావేశం నిర్వహించలేదు. గోదావరి బోర్డు పరిధిలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను చర్చించాలన్న ఏపీ ప్రతిపాదనలపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో సమావేశం నిర్వహణలో జాప్యం కొనసాగుతోంది.

ప్రాజెక్టులపై రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు

ఇప్పటికే కేంద్ర జల సంఘం, సాంకేతిక సలహా మండలి అనుమతులు పొందిన ప్రాజెక్టులను తిరిగి చర్చించడం సమంజసం కాదన్నది తెలంగాణ వాదన. మరోవైపు, గోదావరి బోర్డు పరిధిలోని ప్రాజెక్టుల అంశాలను అజెండాలో చేర్చాలని ఏపీ కోరుతోంది. ఈ అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చర్చలు ముందుకు సాగడం లేదు. కృష్ణా బోర్డు పరిధిలోనూ నీటి పంపిణీ, ప్రాజెక్టుల వారీగా నీటి వినియోగం, టెలిమెట్రీ వ్యవస్థల ఏర్పాటు వంటి అంశాలపై విభేదాలు కొనసాగుతున్నాయి. తెలంగాణకు సంబంధించిన అభ్యంతరాలు, డిమాండ్లను బోర్డు సమావేశాల్లో చర్చించి పరిష్కరించాల్సి ఉంది. అయితే సమావేశాల నిర్వహణలో జాప్యం కారణంగా కీలక అంశాలపై చర్చలు, నిర్ణయాలు వాయిదా పడుతున్నాయి. రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారం కోసం బోర్డుల భేటీలు ఎప్పుడు జరుగుతాయన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

పరిషత్ ఎన్నికల్లో అంచనాలు తారుమారు...

నెల్లూరు : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కూటమి పార్టీలకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయి. మున్సిపల్ ఎన్నికల్లో కనిపించిన ఆధిపత్యం పరిషత్ ఎన్నికల్లోనూ కొనసాగడంతో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఉత్తరాంధ్ర నుంచి కోస్తాంధ్ర వరకు, గోదావరి జిల్లాల నుంచి రాయలసీమ వరకు కూటమి అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో విజయం సాధించారు. అధికారికంగా పార్టీ తరఫున బరిలో నిలిచిన అభ్యర్థులతో పాటు టికెట్లు దక్కక స్వతంత్రులుగా పోటీ చేసిన కూటమి నాయకులు కూడా గెలవడం ఈ ఎన్నికల్లో ప్రత్యేకంగా కనిపించింది.సాధారణంగా ఒకే పార్టీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉంటే ఓట్లు చీలిపోయి ప్రత్యర్థి పార్టీకి ప్రయోజనం కలుగుతుందని రాజకీయ వర్గాలు భావిస్తుంటాయి. ఈ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి తమకు అనుకూలిస్తుందని వైసీపీ నాయకత్వం ఆశించి ఉండవచ్చు. అయితే ఫలితాలు మాత్రం అందుకు భిన్నంగా వచ్చాయి. అధికారిక అభ్యర్థితో పాటు రెబల్‌గా పోటీ చేసిన నాయకుల్లో ఒకరిని ఓటర్లు ఆదరించారు. కొన్ని ప్రాంతాల్లో ఇద్దరు కూటమి అభ్యర్థుల మధ్య పోటీ ఉన్నప్పటికీ వైసీపీకి ఆశించిన స్థాయిలో ప్రయోజనం దక్కలేదు.నెల్లూరు జిల్లాలోని ఇందుకూరుపేట, జలదంకి, ఆత్మకూరు, వెంకటాచలం మండలాల్లో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. వీరంతా తెలుగుదేశం పార్టీనుంచి టికెట్ ఆశించి, అవకాశం దక్కకపోవడంతో స్వతంత్రులుగా బరిలోకి దిగినవారే కావడం గమనార్హం. శ్రీకాకుళం జిల్లాలోనూ రెబల్ అభ్యర్థుల ప్రభావం స్పష్టంగా కనిపించింది. అక్కడ ఏకంగా 16 మంది స్వతంత్రులు గెలుపొందగా, వారిలో అత్యధికులు టీడీపీకి చెందినవారే కావడం పార్టీ స్థానిక బలాన్ని సూచిస్తోంది.

ఏపీ సీపీఎస్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

-మొదటిపేజీ తరువాయి

మార్గదర్శకాలను రూపొందించారు.

ఎవరెవరికి అవకాశం?

ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు ఉద్యోగ నియామక నోటిఫికేషన్ విడుదలై, ఆ తర్వాత నియామకం పొంది ప్రస్తుతం సీపీఎస్ పరిధిలో ఉన్న ఉద్యోగులు ఓపీఎస్‌ను ఎంచుకోవడానికి అర్హులు. అంటే నోటిఫికేషన్ తేదీ 2004 సెప్టెంబర్ 1 కంటే ముందుండి, నియామకం ఆ తేదీన లేదా ఆ తర్వాత జరిగిన ఉద్యోగులకు ఈ అవకాశం వర్తిస్తుంది. ప్రస్తుతం విధుల్లో కొనసాగుతున్న అర్హులైన ఉద్యోగులతో పాటు, ఇప్పటికే పదవీ విరమణ చేసినవారు, ఫ్యామిలీ పెన్షన్ పొందుతున్న అర్హులైన లబ్ధిదారులు కూడా ఈ ఒక్కసారి ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఇందుకోసం అర్హులైన వారు 2026 డిసెంబర్ 31లోగా తమ ఐచ్ఛికాలను సమర్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

కేంద్ర మార్గదర్శకాల ఆధారంగా నిర్ణయం

కేంద్ర ప్రభుత్వ పరిధిలో నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) అమల్లోకి రాకముందే నియామక ప్రక్రియ ప్రారంభమైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని ఎంచుకునే అవకాశం కల్పిస్తూ కేంద్ర పెన్షన్లు, పెన్షనర్ల సంక్షేమ శాఖ 2020--2023 మధ్య పలు కార్యాలయ మెమోరాండంలను జారీ చేసింది. అదే విధానాన్ని అనుసరిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఈ ప్రయోజనాన్ని కల్పిస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు.

దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక ఆదేశాలు

ఈ ప్రక్రియను పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించాలని ఆర్థికశాఖ స్పష్టం చేసింది. సంబంధిత నియామక అధికారులు, కార్యాలయ అధిపతులు అందిన దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలించాలని ఆదేశించింది. అవసరమైన రికార్డులను పక్కాగా నిర్వహించి, అర్హతలను నిర్ధారించాలని సూచించింది. సచివాలయ విభాగాలు, హెచ్ఓడీలు, ట్రెజరీ అధికారులు ఈ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నిర్ణీత గడువులోగా అర్హులైన ఉద్యోగుల పెన్షన్ ప్రయోజనాలను ఖరారు చేయాలని స్పష్టం చేసింది. జీవోకు సంబంధించిన పూర్తి వివరాలను రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చని ఆర్థికశాఖ తెలిపింది.

ఏపీఎండీసీకి ప్రభుత్వం భారీ ఊరట..

-మొదటిపేజీ తరువాయి

ఈ నిర్ణయం తీసుకుంది. తాజా ఉత్తర్వులతో ఏపీఎండీసీకి ఉన్న మొత్తం రుణ గ్యారంటీ పరిమితి రూ.906.52 కోట్ల నుంచి రూ.1,021.52 కోట్లకు పెరిగింది.

గతంలో రూ.906.52 కోట్లకు అనుమతి

2025 ఏప్రిల్‌లో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. వాణిజ్య బ్యాంకులు, ఆర్థిక సంస్థలు లేదా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నుంచి నాన్-ఫండ్ ఆధారిత పరిమితుల కింద రూ.906.52 కోట్ల వరకు రుణ సదుపాయం పొందేందుకు ఏపీఎండీసీకి ప్రభుత్వం అనుమతిచ్చింది. తాజాగా సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (వీసీ అండ్ ఎండీ) సమర్పించిన ఈ-ఫైల్ ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం మరో రూ.115 కోట్ల గ్యారంటీని మంజూరు చేసింది.

అసలు, వడ్డీకి ప్రభుత్వ గ్యారంటీ

ఈ గ్యారంటీ రుణం పూర్తి కాలానికి వర్తించనుంది. రుణ అసలుతో పాటు వడ్డీ చెల్లింపులకు కూడా ప్రభుత్వ హామీ ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అయితే రుణం, వడ్డీ చెల్లింపుల బాధ్యత పూర్తిగా ఏపీఎండీసీదేనని ప్రభుత్వం పేర్కొంది.

5 శాతం గ్యారంటీ కమిషన్

రుణాన్ని ముందస్తుగా చెల్లించే అవకాశం ఉండేలా ఆర్థిక సంస్థలతో కుదుర్చుకునే ఒప్పందాల్లో జీరో ఫోర్‌క్లోజర్ ఛార్జీల నిబంధన ఉండేలా చూసుకోవాలని ఏపీఎండీసీకి సూచించింది. ప్రభుత్వం కల్పించిన గ్యారంటీపై సంస్థ ఏటా 5 శాతం చొప్పున గ్యారంటీ కమిషన్‌ను ప్రభుత్వానికి చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో బొగ్గు గనుల వేలంలో పాల్గొనేందుకు ఏపీఎండీసీకి అదనపు ఆర్థిక బలం చేకూరనుంది.

ఏపీలో వరుస ఎన్నికలు...

విజయవాడ : ఏపీలో వరసగా ఎన్నికలు జరుగుతున్నాయి. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఇప్పటికే ముగిశాయి. దీంతో ప్రభుత్వం మిగతా పంచాయతీ, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు కసరత్తు ప్రారంభమైంది. ఈ మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికలు ఒకే విడతలో జరగనున్నాయి. ఈ ఎన్నికలపై రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ అధికారులు స్పష్టమైన గైడ్‌లైన్స్‌ను కూడా ఇవ్వడం జరిగింది.ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సందడి నెలకొంది. ముందు మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు జరగ్గా.. తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు విజయవంతంగా ముగిశాయి. వీటికి సంబంధించిన ఫలితాలు కూడా వచ్చేశాయ్. దీంతో మిగిలిన ఎన్నికలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ని ఖరారు అయింది. ఇక ప్రాథమి వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఈ ఎలక్షన్‌ని ఒకే విడతలో నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఎ.బాబు శనివారం జిల్లా సహకార అధికారులకు స్పష్టమైన గైడ్‌లైన్స్‌ను జారీ చేశారు.అలాగే ఈ ఎలక్షన్ పనుల్లో ఎలాంటి ఆలస్యం, నిర్లక్ష్యం సహించేది లేదని కమిషనర్ తెలిపారు. కిందిస్థాయి అధికారులకు, ఎంప్లాయీస్‌కి ఎన్నికల నిర్వహిణతో పాటు చట్టపరంగా ఉన్న నిబంధనలపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. అంతేకాదు ఆదేశాలు అందిన పది రోజుల్లోగా వెంటనే సంబంధిత కార్యాచరణపై రిపోర్ట్ అందించాలని తెలియజేశారు. దీంతోపాటు రైతు సేవా కేంద్రాల వారీగా ప్రాథమిక ఓటర్ల లిస్ట్‌లను రెడీ చేసి, 'ఈ-పీఏసీఎస్ ఈఆర్‌పీ' పోర్టల్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించడం జరిగింది. అదేవిధంగా ఓటర్లకు అనుకూలంగా ఉండే పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ముందుగానే అంచనాకు రావాలని సూచించడం జరిగింది.ఈ కోపరేటివ్ సోసైటీ ఎన్నికలు ఒకే విడతలో జరగనున్నాయి. కాబట్టి దీనికి తగ్గట్టుగా బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి, ప్రింటింగ్ ప్రెస్‌ల లభ్యతపై ముందస్తు ప్లాన్ చేసుకోవాలని కమిషన్ సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లను గుర్తించి, చట్టపరమైన విషయాలపై పట్టున్న అధికారులను నియమించాలని చెప్పారు. దీంతోపాటు పోలింగ్ సిబ్బంది, జోనల్ అధికారులకు ట్రైనింగ్ ఇవ్వాలని, ఇతర శాఖల ఉద్యోగుల వివరాలను సేకరించాలని కూడా సూచించారు. ఎన్నికల నిర్వహణకయ్యే ఖర్చులను అంచనా వేయాలని అలాగే శాంతిభద్రతల ఏర్పాట్లను పర్యవేక్షించాలని సంబంధిత మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. కాగా ఇప్పటికే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ఖరారైంది. ఆ ఎన్నికలు వచ్చే నెల మొదటి వారంలోనే పూర్తి కానున్నాయి.

గ్రామాల్లో సందడి

రాష్ట్రంలో 13 వేల 219 పంచాయతీలకు పోలింగ్, కౌంటింగ్ నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధమైంది. ఈ నెల 13వ తేదీన ఎన్నికల షెడ్యూల్2ని అధికారికంగా రిలీజ్ చేయనున్నట్టు రాఇఅ ప్రకటించింది. దీంతో మళ్లీ పొలిటికల్ హీట్ ఎక్కింది.పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో జరగనున్నాయి. ఈ మేరకు నవంబర్ 13న మొదటి దశ, 16న రెండో దశ, 19వ తేదీన మూడో దశకు నోటిఫికేషన్లను జారీ చేయనున్నారు. తొలివిడతలో భాగంగా నోటిఫికేషన్ 13న విడుదలైతే.. నవంబర్ 17వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుంది. నవంబర్ 26న పోలింగ్ నిర్వహించి.. ఫలితాలను వెల్లడించడం జరుగుతుంది. రెండో విడతలో భాగంగా 16న నోటిఫికేషన్ రిలీజ్ చేస్తారు. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ నవంబర్ 20. ఇక నవంబర్ 29న పోలింగ్, ఫలితాలు వెల్లడిస్తారు. అలాగే మూడో విడత నోటిఫికేషన్ 19న విడుదల కాగా.. నవంబర్ 23 వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుంది. ఫైనల్ పోలింగ్, ఫలితాలను డిసెంబర్ 2వ తేదీన వెల్లడించడం జరుగుతుంది.రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు చాలా కీలకంగానే ఉంటాయి. గ్రామాల్లో ఈ ఎన్నికల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తికరంగా ఉంటారు. ఈ పంచాయతీ ఎన్నికలు అధికారికంగా పార్టీల గుర్తులపై జరగకపోయినా.. కూటమి, వైసీపీ మద్దతుదారుల మధ్యే పోటీ తీవ్రంగా ఉంటుంది. రాష్ట్రంలో కొత్త గవర్నమెంట్ ఏర్పాటైన తర్వాత జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో అధికార, ప్రతిపక్షాలకు ఇవి అత్యంత కీలకం కానున్నాయి. మొత్తానికి పల్లె పోరుకు సిద్ధమైంది.

కార్తీక మాస ఆధ్యాత్మిక శోభతో వెలుగులీనుతున్న నూకాంబిక ఆలయం.



అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 09:కార్తీక మాస ఆధ్యాత్మిక శోభతో వెలుగులీనుతున్న నూకాంబిక అమ్మవారి దేవస్థానం. దేవస్థానంలో సోమవారం ఆకాశ దీపం, అఖండ దీపాన్ని ప్రారంబించారు. హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్ర మైనదిగా భావించే కార్తీక మాసం ప్రారంభాన్ని పురస్కరించుకొని అనకాపల్లి నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

కార్తీక మాస పవిత్రతకు ప్రతీకగా దేవస్థానంలో ఆకాశ దీపంతో పాటు అఖండ దీపాన్ని భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. ఈ దీప ప్రజ్వలన కార్యక్రమం ఆలయ ప్రాంగణంలో భక్తిమయ వాతావరణం తో ఆనందోత్సాహలతో సందడి నెలకొంది.

కార్తీక మాసంలో దీపారాధనకు విశేష మైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. ఆకాశ దీపం సమస్త లోకాల శ్రేయస్సును, లోకక్షేమాన్ని ఆకాంక్షిస్తూ వెలిగించే పవిత్ర జ్యోతికి ప్రతీకగా నిలుస్తుంది. అఖండ దీపం నిరంతర దైవస్మరణకు, జ్ఞానజ్యోతికి, అజ్ఞానాంధకారాన్ని తొలగించే ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా భక్తులు భావిస్తారు.

ఈ పవిత్ర దీపాల వెలుగులో సకల జనులకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులు కలగాలని, లోకమంతా సుభిక్షంగా ఉండాలని నూకాంబిక అమ్మవారిని ప్రార్థించారు.

కార్తీక మాసమంతా భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని దీపారాధనలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని దేవస్థానం నుండి చైర్మన్ పీలా నాగ శ్రీను, దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభిమానులు సత్కారం



చోడవరం, నవంబర్9 పెన్ సత్తా.... ప్రాదేశిక ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులను పలువురు నాయకులు కార్యకర్తలు అభిమానులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ అభ్యర్థి గూనూరు మల్లునాయుడు ను, జడ్పిటిసి సభ్యులు కనిశెట్టి మత్స్యరాజును, చోడవరం ఎంపీటీసీ 1 ను గూనూరు ఎర్ర అప్పలనాయుడును, ఎంపీటీసీ 4 కందర్ప రమణమూర్తిని, గజపతినగరం ఎంపీటీసీ విల్లూరి మాధవి అన్నపూర్ణను (షుగర్ ఫ్యాక్టరీ రిటైర్డ్ ఉద్యోగి కనిశెట్టి ఈశ్వరరావు కోడలు), గాంధీగ్రామం ఎంపీటీసీ దాడి వెంకట పద్మ (దాడి నాగ అప్పారావు), అంబేరుపురం ఎంపీటీసీ దాడి వెంకట అప్పారావు ను లను కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు.

ఎంపీపీలు జడ్పిటిసిలను సత్కరించిన ఎమ్మెల్యే

చోడవరం, నవంబర్9 పెన్ సత్తా... ప్రాదేశిక ఎన్నికల్లో చోడవరం నియోజకవర్గంలోని ఎంపీపీలుగా, జడ్పిటిసిలుగా విజయం సాధించిన అభ్యర్థులను ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు అభినందించి ఘనంగా సత్కరించారు. చోడవరం ఎంపీపీ అభ్యర్థి గూనూరు మల్లునాయుడు ను, బుచ్చియ్యపేట ఎంపీపీ అభ్యర్థి గేదెల సత్యనారాయణ ను, చోడవరం జడ్పిటిసిగా విజయం సాధించిన కనిశెట్టి సన్యాసిరావు (మత్స్యరాజు) లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భారీగా నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



స్వయంభూ గణపతి ఆలయంలో ఘనంగా దీపారాధన



చోడవరం, నవంబర్9 పెన్ సత్తా.... స్థానిక స్వయంభూ శ్రీవిఘ్నేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా దీపారాధన చేశారు. దీపావళి పర్వదినం సందర్భంగా ఆలయం ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి గణనాథుని గర్భగుడిలో ప్రత్యేక దీపారాధన చేసి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయం చైర్మన్ మంగా శ్రీనివాసరావు దంపతులు, దేవాదాయ శాఖ ఈఓ కిరణ్మయి, శంకర్, శ్రీనురాజు, సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

ఎంపిటిసి బైన ఈశ్వరరావు కు ఘనంగా సత్కారం

చోడవరం, నవంబర్9 పెన్ సత్తా... నూతనంగా ఎంపిటిసిగా ఎన్నికైన వైసిపి సీనియర్ నాయకులు బైన ఈశ్వరరావు ను ఆ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బైన నాగేశ్వరరావు 3 సార్లు ఎంపీటీసీగాను, ఒక సారి సర్పంచ్ గా ఎన్నికయ్యారు. గత పాలకవర్గంలో వైస్ ఎంపీపీగా చేశారు. బైన ఈశ్వరరావు విజయం పట్ల వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, రాష్ట్ర మీడియా సెల్ కార్యదర్శి పందిరి శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఓరుగంటి నెహ్రూబాబు శు భాకాంక్షలు తెలిపి సత్కరించారు.



వైస్ ఎంపీపీ అభ్యర్థి కందర్ప రమణమూర్తిని ఘనంగా సత్కరించిన బిజెపి నాయకులు



చోడవరం, నవంబర్9 పెన్ సత్తా..... బిజెపి సీనియర్ నాయకులు, చోడవరం ఎంపీటీసీగా నూతనంగా ఎన్నికైన కందర్ప రమణమూర్తి ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితర నాయకులు ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలో బిజెపి కి ఒకే ఎంపీటీసీ కేటాయించినందున కందర్ప రమణమూర్తి కి వైస్ ఎంపీపీ పదవి ఇవ్వాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

గెలుపొందిన ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను సత్కరించిన కొణతాల.



అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 09: నియోజవర్గం మండలంలో గెలుపొందిన ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను చిరు సత్కారం చేసిన కొణతాల రామకృష్ణ.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయమే రాబోయే పంచాయతీ ఎన్నికలకు పునాది కావాలి...కొణతాల రామకృష్ణ. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సాధించిన విజయాన్ని రాబోయే పంచాయతీ ఎన్నికలకు పునాదిగా తీసుకొని, ప్రతి పంచాయతీలోనూ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పిలుపు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో అనకాపల్లి, కశింకోట మండలాలకు చెందిన గెలుపొందిన కూటమి అభ్యర్థులను అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ చిరు సత్కారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయడం వల్ల మంచి ఫలితాలు సాధించగలిగామని తెలిపారు. కొన్ని స్థానాల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి ఎదురైనప్పటికీ, ప్రజల మద్దతు కూటమికి బలంగా ఉందని పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపికలో స్థానిక నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ, గెలుపు అవకాశాలను పరిగణనలోకి తీసుకోవడం విజయానికి ప్రధాన కారణమన్నారు. ఇదే విధానాన్ని రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించాలని సూచించారు. జనసేన, తెలుగుదేశం, బీజేపీ అనే తేడా లేకుండా కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. రాబోయే రెండున్నర సంవత్సరాల్లో గ్రామాల్లో మరింత అభివృద్ధి సాధించాలంటే పంచాయతీ ఎన్నికల్లో కూటమి బలమైన విజయాన్ని సాధించడం ఎంతో అవసరమని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు పంచాయతీలు కీలకమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా సాధ్యమైన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని రెట్టింపు ఉత్సాహంతో చేపడతామని హామీ ఇచ్చారు.


విజయం సాధించిన తర్వాత అహంకారానికి తావివ్వకుండా, మరింత వినయంతో ప్రజల వద్దకు వెళ్లి ఇతరులను కూడా కలుపుకొని ముందుకు సాగాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

ప్రస్తుత విజయంతో మరింత బాధ్యత పెరిగిందని, ఇదే ఐక్యత, సమన్వయం, పట్టుదలతో రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ నూటికి నూరు శాతం విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని కొణతాల గారు పిలుపు నిచ్చారు.

ఈ విజయానికి కృషి చేసిన కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరికీ హృదయపూర్వక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, కశింకోట మండలాలకు చెందిన కూటమి నాయకులు, పాల్గొన్నారు.ం

నిమ్మాడలో పాలకొండ మండలం విజేతల సందడి..

- మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన 11 మంది ఎంపీటీసీలు.
- ఎంపీటీసీ ఎన్నికల్లో విజేతలకు మంత్రి అచ్చెన్నాయుడు అభినందనలు.



కోటబొమ్మాళి, పెన్ సత్తా, నవంబర్ 09:ఇటీవల విడుద లైన ఎంపీటీసీ ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించిన పాలకొండ మండలానికి చెందిన 11 మంది ఎంపీటీసీలు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.ఎన్నికల్లో విజయం సాధించిన ఆనందాన్ని మంత్రితో పంచుకుంటూ, పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు విజేతలను అభినందించి, ప్రజలు తమ పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కె. యోగిత, పద్మ ప్రియదర్శిని, శ్రీనివాసరావు, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎన్నికల విజేతలు.



అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 09:ఉత్తరాంధ్ర ఇలవేల్పు, ప్రముఖ పుణ్యక్షేత్రం, గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఆశ్వీజమాంసం ఆదివారం అమావాస్య పూజలో పాల్గొని స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలుపొందిన జీవీఎంసీ కార్పొరేటర్లు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. వీరిని ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహ కమిషనర్ బుద్ద మహాలక్ష్మినగేష్ ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవి కుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాస రావు,కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారినాగేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో భక్తులకు విశేష పూజలతో శివానుగ్రహం




యాడికి, పెన్ సత్తా, నవంబర్ 09యాడికి మండలకేంద్రంలోని హాస్పిటల్ కాలనీ హై స్కూల్ గ్రౌండ్ వెనకాల నాగుల కట్ట వీధిలో వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి స్పటిక లింగ ప్రాణం ప్రతిష్ట మహోత్సవం అనంతరం కార్తీక మాసం మొదలు సోమవారం కావడంతో స్పటిక లింగం ప్రతిష్ట అనంతరం ఒక మండలం 41 రోజులు ఎంతో ఘనంగా అభిషేక కార్యక్రమాలు జరుగుచున్నవి కావున భక్తులు అందరూ స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని అంగరంగ వైభవంగా ఆలయాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేయడం జరిగింది ప్రతిరోజు శివనామస్మరంతో రకరకాల పూలు పండ్లతో జలాభిషేకం పుష్పాభిషేకం తేనాభిషేకంపంచామృతాభిషేకం అనేక అభిషేకాలతో ప్రతిరోజు ఉదయం 5 గంటలకి స్వామివారికి నిత్య పూజ అభిషేకాలు కార్యక్రమాలు ఎంతో ఘనంగా ప్రతిరోజు జరుగుచున్నవి కావున భక్తులందరూ స్వామివారికి అభిషేకము చేయించాలి అనుకున్న భక్తులు ఆలయ కమిటీ సభ్యులకు సంప్రదించాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారుద

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- **గ్రామీణుల్లో చైతన్యం తీసుకురావాలి**
- **న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవంలో అదనపు జిల్లా జడ్జి**

హిందూపురం, పెన్ సత్తా, నవంబర్ 09:మనిషి పుట్టుక నుండి మరణం వరకు ప్రతి అంశం చట్టంతో ముడిపడి ఉంటుందని, ప్రతి ఒక్కరూ అదనపు జిల్లా జడ్జి వి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు.చిన్నపాటి సమస్యలకు న్యాయస్థానాలు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి వ్యయప్రయాసాలకు గురికాకుండా రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరిం చుకునేందుకు న్యాయ సేవాధికార సంస్థను ఏర్పాటు చేయడంజరిగిం దన్నారు. ఈ న్యాయసేవాధికార సంస్థ ద్వారా చట్టాలపై అవగాహన కల్పించ డంతోపాటు అర్హత ఉన్న వారందరికీ న్యాయ సహాయం అందించడం జరుగుతుం దన్నారు. లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం ద్వారా ఇరు వర్గాలతో సామరస్యంగా చర్చించి కేసులను పరిష్కరిం చడం జరుగుతుందని తెలిపారు. దీనివల్ల న్యాయవాదులకు ఎలాంటి నష్టం ఉండదని, వీటిపై కక్షిదారులకు సైతం అవగాహన కల్పించాలన్నారు. సామాజిక సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలను కూడా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందనిబు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పారా లీగల్ వాలంటీర్లు చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తరచూ సమావేశాలను ఏర్పాటు చేసి చట్టాలు, న్యాయ సంబంధ విషయాలపై చర్చించి చైతన్యం తీసుకురావాలని న్యాయమూర్తి సూచించారు. పారా లీగల్ వాలంటీర్లకు న్యాయవాదుల ద్వారా శిక్షణ ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. లోక్ అదాలత్ ఇప్పటికే ఎన్నో సామాజిక సమస్యలు పరిష్కార మయ్యాయని తెలిపారు. అలాంటి వాటిపై న్యాయ వాదులు కూడా దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనంత గోపాలకృష్ణ, ఏజిపి రామచంద్రప్ప, న్యాయవాదులు రాజశేఖర్, సిద్దు, శ్రీనివాస్ రెడ్డి, నాగరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటిసి ,ఎంపీటీసీలను సన్మానించిన రాష్ట్ర సగర ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ



పరిగి, పెన్ సత్తా, నవంబర్ 09:మండలం జడ్పిటిసి గాఎన్నికైన శాసనకోట యూజీ వెంకటేష్ ను వారి స్వగ్రామం నందు సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకట రమణ ఆధ్వర్యంలో రంగేపల్లి మాగే చెరువు గ్రామస్తులు మరియు సగర ఉప్పర సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని శాలువా పూలమాలతో వెంకటేష్ ను సత్కరించడం జరిగింది.అదేవిధంగా కేతగాని చెరువు ఎంపీటీసీ అభ్యర్థి డి లోకేంద్ర ను వారి స్వగ్రామం నందు పూలమాల శాలువాతో సత్కరించడం జరిగింది. బీసీలకు అన్నివిధాలా అభ్యున్నతికి టీడీపీ కృషి చేసిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ వెంకటరమణ ఆధ్వర్యంలో యువకులు పెద్దలు మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.సింగిల్ విండో చైర్మన్ పూల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన పి.వి.ఎస్.ఎన్ రాజు ను మర్యాదపూర్వకంగా కలిసిన విజేతలు



చోడవరం, నవంబర్9 పెన్ సత్తా.... స్థానిక ఎన్నికల్లో ఎంపీటీసీలుగా విజయం సాధించిన అభ్యర్థులు జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్చార్జి పి.వి.ఎస్.ఎన్ రాజు ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయన్ను సత్కరించారు. ఎంపీటీసీలు దాడి వెంకట అప్పారావు, సత్యవరపు శ్రీనివాసరావు, బొడ్డు ధనలక్ష్మి, అడ్డూరి రాజు తదితరులు సత్కరించారు. అలాగే వారికి పి.వి.ఎస్.ఎన్ రాజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నందవరపు రమాదేవి నాయుడు, సాయిరాం గ్రాండ్ శ్రీను, కర్రి రమేష్, మంగా శ్రీనివాసరావు, పీలా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాల నిలుపు మహోత్సవం.



అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 09: 140 సంవత్సరాల చరిత్ర కలిగిన గవరపాలెం శతకంపట్టు వద్ద గల గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాల నిలుపు మహోత్సవం గౌరీపరమేశ్వరి కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించ బడ్డాయి. సాయంత్రం దాసరిగెడ్డ రోడ్డు లో వున్న విల్లూరి సత్యం పొలం నుండి వరిదుబ్బు తీసుకొచ్చి పూజారి తో అమ్మవారిని పెట్టించారు. రమేష్ ఆర్ట్స్ రంగులతో రూపొందించిన వినాయక సమేత గౌరీపరమేశ్వరుల విగ్రహానికి ఆలయ పురోహితులు నేతేటి సుబ్రమణ్య శర్మ పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక మనోహర ఆర్కేడ్ నుండి పురవీధుల గుండా తీన్మార్, డీజే, బాండు మేళం లతో ఊరేగించి తెల్లవారుజామున అమ్మవారి గుడిలో నిలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, ఆలయ ప్రతినిధులు కొణతాల మురళీకృష్ణ, పి.వి.రమణ, కొణతాల ప్రసాద్, దాడి కృష్ణ, మద్దాల శంకర్రావు, పెంటకోట వెంకట సత్యనారాయణ, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, కొణతాల కృష్ణంరాజు, పొలిమేర రవి, గండేపల్లి మురళి,బుద్ధ సంతోష్,విల్లూరి పరదేశీ నాయుడు, విల్లూరి నానాజీ, పొలమరశెట్టి సూర్య, పిల్లా సత్యనారాయణ, పెంటకోట ఈశ్వర్రావు, పెంటకోట సన్యాసి నాయుడు, మద్దాల చిరంజీవి, దాడి కిరణ్, యల్లపు నాయుడు, పెంటకోట లక్ష్మినారాయణ, మళ్ల రాజు, దొడ్డి జీవన్, విల్లూరి ఫణి తదితరులు పాల్గొన్నారు.

కేరింతల మధ్య నరకాసురుని వధ...



అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 09:పట్టణం లోని గవరపాలెం పీలా వారి గౌరీ పరమేశ్వరుల ఆలయం వద్ద దీపావళి అమావాస్య పండగ సందర్భంగా ఆదివారం రాత్రి ప్రజల కేరింతల మధ్య నరకాసురుని వధ కోలాహలంగా జరిగింది. సుమారు 15 అడుగుల మేరకు తయారు చేసిన నరకాసురుని ప్రతిమకు ఆలయ కమిటీ సభ్యులు నిప్పంటించారు.. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. సుమారు గంటకు పైగా ఈ కార్యక్రమం జరిగింది. ప్రతి యేట మాదిరిగానే నరకాసురుడి వద కార్యక్రమాన్ని గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో శాశ్వత గౌరవ అధ్యక్షులు కొణతాల రఘునాథ్, శాశ్వత చైర్మన్ భీమర శెట్టివరాహ నూకరాజు, అధ్యక్షులు బీమర శెట్టి మహాలక్ష్మి నాయుడు,
కార్యదర్శి బుద్ధ శివ, కోశాధికారులు భీమరశెట్టి లక్ష్మీనారాయణ, కొణతాల కృష్ణ, ఉపాధ్యక్షులు పీల నాయుడు,
సహాయ కార్యదర్శి బుద్ధ శ్రీను,
గౌరవ సభ్యులు బుద్ధ శ్రీనివాస రావు, భీమరశెట్టి శ్రీనివాస రావు, బుద్ధ బలరాం నాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం.





కవిటి పెన్ సత్తా, నవంబర్ 09:ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నెలవంక ఎంపీటీసీ స్థానాన్ని కూటమి అభ్యర్థి మంచి మెజారిటీతో కైవసం చేసుకోవడం హర్షించదగ్గ విషయంగా నిలిచింది. ఈ ఘన విజయంతో నెలవంక పంచాయతీలో కూటమి శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.గెలిచిన అభ్యర్థులకు సోమవారం స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బెందాలం అశోక్ బాబు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. నెలవంక అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, గెలిచిన అభ్యర్థి ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండా శంకర్ రెడ్డి మాట్లాడుతూరాష్ట్ర అభివృద్ధి కేవలం కూటమి ప్రభుత్వంతో మాత్రమే సాధ్యమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి వలన మాత్రమే రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నెలవంక పంచాయతీ ప్రజలు, కూటమి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

బీసీ రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ :కొండా శంకర్ రెడ్డి

ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షాలపై దేశద్రోహులు, విదేశీ శక్తుల చేతుల్లో కీలుబొమ్మలుగా ఉన్నారంటూ చేసిన ఆరోపణలపై ప్రధాని బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. గతంలో తాను చేసిన సవాల్ ఇప్పటికీ అలాగే ఉందని, ఏ సమయంలోనైనా, ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో రాహుల్ గాంధీ పోస్ట్ చేశారు.

జవాన్లు మోదీ వ్యాఖ్యలను నమ్మలేదంటూ..

దీపావళి సందర్భంగా భద్రతా సిబ్బందిని ఉద్దేశించి ప్రధాని మోదీ చేసిన ప్రసంగంపై రాహుల్ గాంధీ స్పందించారు. ప్రసంగం వింటున్న జవాన్ల ముఖ కవళికలను చూస్తే ప్రధాని చెప్పిన మాటలను వారు నమ్మలేదని అర్థమవుతోందంటూ వ్యాఖ్యానించారు. తమను నక్సలైట్లుగా అభివర్ణించారని పేర్కొంటూ, ఎవరు దేశద్రోహులు? విదేశీ శక్తుల నియంత్రణలో ఉన్నదెవరు? అనే అంశాలపై చర్చకు రావాలని మోదీని కోరారు. చర్చ తర్వాత ప్రధాని ఒక్క జవాన్ ముందు కూడా నిలబడలేరంటూ విమర్శించారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నది ఎవరు? విదేశీ శక్తుల



ప్రభావంలో ఉన్నది ఎవరు? అనే అంశాలపై ప్రజలకు స్పష్టత రావాల్సిన అవసరం ఉందని రాహుల్ గాంధీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు తాను ఎప్పుడైనా సిద్ధమేనని పునరుద్ఘాటించారు.

బస్తర్‌లో జవాన్లతో మోదీ దీపావళి

ఆదివారం ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో భద్రతా సిబ్బందితో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవాన్లను ఉద్దేశించి ప్రసంగిస్తూ దేశంలో సాయుధ నక్సలిజం తగ్గుముఖం పట్టినప్పటికీ, ముప్పు పూర్తిగా తొలగిపోలేదని పేర్కొన్నారు. 'దిమాగీ నక్సల్స్' పేరుతో కొన్ని సంస్థలు, రాజకీయ పార్టీల్లోకి చొరబడి రాజ్యాంగం, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. అలాంటి శక్తులను గుర్తించి ఎదుర్కోవాలని భద్రతా సిబ్బందికి పిలుపునిచ్చారు.

గత ప్రభుత్వాలపై మోదీ విమర్శలు

నక్సల్స్ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనే భద్రతా సిబ్బందికి గత ప్రభుత్వాలు తగిన స్వేచ్ఛ ఇవ్వలేదని ప్రధాని విమర్శించారు. నక్సలైట్లు దాడులకు పాల్పడినప్పుడు ధీటుగా స్పందించే అవకాశం భద్రతా దళాలకు ఉండేది కాదని అన్నారు. తమ ప్రభుత్వం మాత్రం అవసరమైన నిర్ణయాలు తీసుకునే పూర్తి స్వేచ్ఛను భద్రతా బలగాలకు కల్పించిందని పేర్కొన్నారు.

గతంలోనూ విదేశీ శక్తుల అంశంపై సవాల్

గతంలోనూ విదేశీ శక్తుల ప్రభావంపై ప్రధాని మోదీని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. భారత ఆర్థిక వ్యవస్థపై విదేశీ శక్తుల ప్రభావం ఉందంటూ ఆరోపణలు చేశారు. ఈ అంశాలపై మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమని అప్పట్లోనే సవాల్ విసిరారు. తాజాగా బస్తర్ పర్యటనలో ప్రధాని చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మరోసారి అదే సవాల్‌ను రాహుల్ గాంధీ పునరుద్ఘాటించడంతో రాజకీయంగా ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

డీలిమిటేషన్ బిల్లు కోసమే పార్లమెంట్ ప్రొరోగేషన్ ఆలస్యం

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 88 రోజులు గడిచినా, ఇప్పటివరకు అధికారికంగా ప్రొరోగ్ చేయకపోవడంపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంది. డీలిమిటేషన్ బిల్లును ఎలాగైనా ఆమోదింపజేసుకోవాలనే ఉద్దేశంతోనే మోదీ ప్రభుత్వం ఈ జాప్యం చేస్తోందని ఆరోపించింది. లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీని సాధించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సమయం కల్పించడమే దీని వెనుక ఉద్దేశమని విమర్శించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టు చేశారు.

మోదీకి ఖర్గే నాలుగు లేఖలు!

డీలిమిటేషన్ ప్రక్రియపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గత ఆరు నెలల్లో ప్రధాని నరేంద్ర మోదీకి నాలుగు సార్లు లేఖలు రాశారని జైరాం రమేశ్ వెల్లడించారు. అయినప్పటికీ ప్రధాని నుంచి సానుకూల స్పందన రాలేదని ఆరోపించారు. పార్లమెంట్ ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడి 88 రోజులు గడిచినా, సమావేశాలను అధికారికంగా ప్రొరోగ్ చేయలేదని పేర్కొన్నారు.

కౌల్ అండ్ శక్ధేర్ పుస్తకాన్ని ప్రస్తావిస్తూ..

భారత పార్లమెంటరీ విధానాలకు సంబంధించిన ప్రామాణిక గ్రంథం 'కౌల్ అండ్ శక్ధేర్' ఎనిమిదో సంచికలోని 192వ పేజీని జైరాం రమేశ్ ప్రస్తావించారు. సాధారణంగా సభ నిరవధిక వాయిదాకు, సమావేశాల ప్రొరోగేషన్‌కు మధ్య రెండు నుంచి నాలుగు రోజుల వ్యవధి ఉంటుందని అందులో పేర్కొన్నట్లు తెలిపారు. అదే పేజీలోని ఫుట్‌నోట్ 53 ప్రకారం, 2015 నాటి వర్షాకాల సమావేశాల సందర్భంగా ఈ వ్యవధి



28 రోజులుగా నమోదైందని గుర్తుచేశారు. 2024లో విడుదలైన ఈ పుస్తకానికి ప్రధాని మోదీ ప్రత్యేక సందేశం కూడా పంపారని పేర్కొన్నారు.

2008 నాటి రికార్డును ప్రస్తావించిన కేంద్ర మంత్రి

2008లో యూపీఏ ప్రభుత్వ హయాంలోనూ పార్లమెంట్ సమావేశాలు 87 రోజుల పాటు ప్రొరోగ్ కాలేదని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇటీవల కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు లేఖ రాశారు. దీనిపై జైరాం రమేశ్ స్పందిస్తూ.. అప్పట్లో ప్రత్యేక పరిస్థితుల కారణంగా అన్ని పార్టీల ఏకాభిప్రాయంతోనే ఈ జాప్యం జరిగిందని పేర్కొన్నారు.

డీలిమిటేషన్ బిల్లుపై మరోసారి పోరాటం!

2008 నాటి పరిస్థితులకు, ప్రస్తుత పరిస్థితులకు చాలా తేడా ఉందని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. అమిత్ షాకు సమయం కల్పించి, డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవడానికే ప్రస్తుత జాప్యం జరుగుతోందని ఆరోపించారు. గతంలో 2026 ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రతిపక్షాల ఐక్యత కారణంగా ఈ బిల్లు విషయంలో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందని పేర్కొన్నారు. మరోసారి కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను ప్రతిపక్షాలు అడ్డుకుంటాయని స్పష్టం చేశారు. అమిత్ షా అనుసరిస్తున్న బుల్డోజర్ రాజకీయాలను ఎదుర్కొంటామని జైరాం రమేశ్ హెచ్చరించారు.

88 రోజులుగా ప్రొరోగేషన్ పెండింగ్!

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13న ముగిశాయి. సెప్టెంబర్ 9 నాటికి ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడి 88 రోజులు పూర్తయ్యాయి. దీంతో 2008లో నమోదైన 87 రోజుల రికార్డు అధిగమించబడిందని కాంగ్రెస్ పేర్కొంది. అయితే, పార్లమెంట్ సమావేశాలను అధికారికంగా ప్రొరోగ్ చేయడానికి రాజ్యాంగంలో నిర్దిష్ట గడువు లేదని జైరాం రమేశ్ ప్రస్తావించిన నిబంధనల ఆధారంగా చర్చ జరుగుతోంది. పార్లమెంట్ సమావేశాల ప్రొరోగేషన్ ఆలస్యంపై అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. డీలిమిటేషన్ అంశంపై అఖిలపక్ష చర్చ జరగాలన్న కాంగ్రెస్ డిమాండ్ నేపథ్యంలో ఈ వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

88 రోజులుగా ప్రొరోగ్ కాని పార్లమెంట్!

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 88 రోజులు గడిచినా, ఇప్పటికీ అధికారికంగా ప్రొరోగ్ (సమావేశాల ముగింపు ప్రకటన) కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. పార్లమెంటరీ చరిత్రలో అరుదైన పరిణామంగా నిలిచిన ఈ ఘటనతో 2008లో నమోదైన 87 రోజుల రికార్డు బద్దలైంది. ఆగస్టు 13న లోక్‌సభ, రాజ్యసభలను నిరవధికంగా వాయిదా వేసినప్పటికీ, అధికారికంగా ప్రొరోగేషన్ ఉత్తర్వులు జారీ కాలేదు. నవంబర్ 9 నాటికి ఈ వ్యవధి 88 రోజులకు చేరింది.

రాజ్యాంగ సవరణ కోసమేనా జాప్యం?

వర్షాకాల సమావేశాలకు అధికారికంగా ముగింపు ప్రకటించకపోవడంతో పార్లమెంట్‌ను తక్కువ వ్యవధిలోనే తిరిగి సమావేశపరిచే అవకాశం ఉందనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును మరోసారి ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అనుసరిస్తోందనే చర్చ జరుగుతోంది. ప్రతిపాదిత 131వ రాజ్యాంగ సవరణ ద్వారా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చేపట్టి, లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543 నుంచి గరిష్ఠంగా 850కి పెంచాలనే ప్రతిపాదన ఉన్నట్లు సమాచారం. ఈ మార్పులతో మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయాలన్నది కేంద్రం లక్ష్యంగా చెబుతున్నారు.

గతంలో బిల్లుకు ఎదురుదెబ్బ

2026 ఏప్రిల్ 17న జరిగిన ప్రత్యేక పార్లమెంట్ సమావేశంలో మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది. దీంతో బిల్లు ఆమోదం పొందలేదు. ఈ నేపథ్యంలో మరోసారి బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకునేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం ప్రతిపక్ష పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ప్రొరోగేషన్‌కు రాజ్యాంగంలో గడువు లేదు

పార్లమెంట్ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేసిన తర్వాత ఎన్ని రోజుల్లోగా అధికారికంగా ప్రొరోగ్ చేయాలనే విషయంపై రాజ్యాంగంలో నిర్దిష్ట గడువు లేదు. సాధారణంగా సభ నిరవధికంగా వాయిదా పడిన రెండు నుంచి నాలుగు



రోజుల్లో ప్రొరోగేషన్ ప్రక్రియ పూర్తవుతుందని పార్లమెంటరీ విధానాలు సూచిస్తున్నాయి. ప్రస్తుత సమావేశాలను పొడిగించాలన్నా, ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలన్నా సంబంధిత నిబంధనల ప్రకారం ముందస్తు నోటీసులు అవసరం. కొత్తగా సమావేశాలను ఏర్పాటు చేయడానికి కనీసం 14 రోజుల ముందుగా నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. అయితే సమావేశాలు ఎక్కువకాలం ప్రొరోగ్ కాకుండా ఉన్నంత మాత్రాన అది రాజ్యాంగ విరుద్ధమని భావించలేము.

గతంలోనూ ఇలాంటి పరిణామాలు

భారత పార్లమెంట్ చరిత్రలో సభలు నిరవధికంగా వాయిదా పడిన తర్వాత కూడా ప్రొరోగేషన్ ఆలస్యమైన సందర్భాలు ఉన్నాయి.

2008: 87 రోజులు
1987: 76 రోజులు
1989: 54 రోజులు
2006: 49 రోజులు
2013: 49 రోజులు
1963: 41 రోజులు

2008లో అప్పటి యూపీఏ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు జులై 21, 22 తేదీల్లో లోక్‌సభ సమావేశమైంది. అనంతరం సభను ప్రొరోగ్ చేయకుండా ఉంచారు. అక్టోబర్ 17న తిరిగి సమావేశమైన లోక్‌సభ, అక్టోబర్ 24న వాయిదా పడింది. డిసెంబర్ 10న మరోసారి సమావేశమైంది. ఈ క్రమంలో 87 రోజుల పాటు ప్రొరోగేషన్ జరగలేదు. తాజాగా ఆ రికార్డును ప్రస్తుత వర్షాకాల సమావేశాలు అధిగమించాయి.

కేంద్రంపై కాంగ్రెస్ విమర్శలు

పార్లమెంట్ సమావేశాలను ప్రొరోగ్ చేయకపోవడంపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. సాధారణంగా నిరవధిక వాయిదా తర్వాత రెండు నుంచి నాలుగు రోజుల్లోనే ప్రొరోగేషన్ ప్రక్రియ పూర్తవుతుందని గుర్తుచేసింది. డీలిమిటేషన్‌తో ముడిపడిన రాజ్యాంగ సవరణ బిల్లును మరోసారి ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకునేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందా? అని నిలదీసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మూడింట రెండొంతుల మెజారిటీ కోసం ప్రయత్నిస్తున్నారా? అంటూ కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. మొత్తంగా పార్లమెంట్ సమావేశాల ప్రొరోగేషన్ జాప్యం, డీలిమిటేషన్ ప్రతిపాదనలు, మహిళా రిజర్వేషన్ల అమలు అంశాలు ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చకు దారితీశాయి.

ప్రధాని మోదీతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక ఫోన్ సంభాషణ

రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ సంక్షోభాన్ని కేవలం చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ సోమవారం సాయంత్రం ప్రధాని మోదీతో టెలిఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన వివరాలను భారత ప్రధాన మంత్రి కార్యాలయం అధికారికంగా విడుదల చేసింది. పీఎంఓ ప్రకటన ప్రకారం.. రష్యాతో నెలకొన్న ప్రస్తుత యుద్ధ పరిణామాలపై తన అభిప్రాయాలను అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రధాని మోదీతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, సమస్యల పరిష్కారంలో భారత్ ఎల్లప్పుడూ అనుసరించే 'మానవతా దృక్పథాన్ని' పునరుద్ఘాటించారు. వివాదాలను కేవలం చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలనేది భారత్ యొక్క స్థిరమైన విధానమని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించేందుకు ఉద్దేశించిన అన్ని రకాల ప్రయత్నాలకు తమ వంతు సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని తెలిపారు. అలాగే, ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల దృష్ట్యా వివిధ రంగాలలో భారత్-ఉక్రెయిన్ ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై కూడా నేతలిద్దరూ చర్చించారు. మరోవైపు, ఈ ఫోన్ సంభాషణపై ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయం కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. యుద్ధాన్ని ముగింపు దశకు తీసుకువచ్చేందుకు అవసరమైన దౌత్య ప్రక్రియలు, తదుపరి చర్యలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు పేర్కొంది. రాబోయే అబూదాబీ సమావేశ ఎజెండా కోసం ఉక్రెయిన్ సిద్ధమవుతోందని జెలెన్‌స్కీ తెలిపారు. ఉక్రెయిన్ ఎల్లప్పుడూ నిర్మాణాత్మక వైఖరితోనే ఉందని, రష్యా నుంచి కూడా యుద్ధ ఉద్రిక్తతలను తగ్గించే విధంగా అలాంటి చొరవే అవసరమని ఆయన పేర్కొన్నారు. "ఇది యుద్ధాన్ని కొనసాగించాల్సిన సమయం కాదు.. ముగించాల్సిన సమయం అని రష్యా నాయకత్వంతో సహా అందరికీ ప్రధాని మోదీ గతంలో పలుమార్లు స్పష్టంగా చెప్పారు. ఈ నేపథ్యంలో యుద్ధానికి ముగింపు పలికేలా భారత్ తన వంతుగా ఎలాంటి చర్యలు తీసుకోగలదో గుర్తించడం, ఇతర దేశాల నాయకులతో సంప్రదింపులు జరపడం ఎంతో కీలకం" అని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. నల్ల సముద్రంలో నిలిచిపోయిన ధాన్యపు ఎగుమతులు, ఆహార భద్రత అంశంపై కూడా ఇరువురు నేతలు చర్చించారు. ఆహార రవాణా కారిడార్ల పునరుద్ధరణలో మధ్యవర్తిత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని, ఈ విషయంలో భారత్ చేసే ప్రయత్నాల కోసం తాము ఎదురుచూస్తున్నామని ఉక్రెయిన్ తెలిపింది. సముద్ర మార్గాలను అడ్డుకోవడం వల్ల రష్యా ఆర్థిక వ్యవస్థతో పాటు వివిధ దేశాల్లోని కోట్లాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల అట్లాంటాలో జరిగిన జీ20 విదేశాంగ మంత్రుల సదస్సు సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ, ఈ సంక్షోభ పరిష్కారం కోసం భారత్ నిరంతరం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. పౌర నౌకలు మరియు నావికులపై దాడులు జరగకుండా చూడటం, నల్ల సముద్రం ద్వారా ధాన్యపు ఎగుమతులను పునరుద్ధరించడం, అలాగే ఇంధన మౌలిక వసతులపై దాడులు జరగకుండా చూడటం అనే మూడు ప్రధాన అంశాలపై భారత్ రష్యా, ఉక్రెయిన్ మరియు యూరప్ దేశాలతో చర్చిస్తోందని తెలిపారు.

ఎర్రకోట పేలుడు తర్వాత ఉగ్రవాదంపై ఉక్కుపాదం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట వద్ద కారు బాంబు పేలుడు జరిగి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో కేంద్ర భద్రతా సంస్థలు దేశవ్యాప్తంగా నిఘాను మరింత కట్టుదిట్టం చేశాయి. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా నివారణ చర్యలను ముమ్మరం చేశాయి. గత ఏడాది కాలంలో సరిహద్దులకు అవతల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌లపై భద్రతా దళాలు విస్తృతంగా దాడులు నిర్వహించాయి. ఈ క్రమంలో 300 మందికి పైగా ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధం ఉన్నవారిని అరెస్టు చేయగా, విదేశాల్లో తలదాచుకున్న 73 మంది మోస్ట్ వాంటెడ్ నిందితులను భారత్‌కు తీసుకొచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఎర్రకోట పేలుడు నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి దాడులను అడ్డుకునేందుకు కేంద్ర నిఘా సంస్థలు ప్రత్యేక కార్యాచరణను రూపొందించాయి. ఇందులో భాగంగా ఫిబ్రవరి 23న 'ప్రహార్: జాతీయ ఉగ్రవాద నిరోధక విధానం, వ్యూహం' ను ప్రవేశపెట్టాయి. ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తామని 2026 సెప్టెంబర్‌లో జరిగిన రాష్ట్రాల డీజీపీలు, కేంద్ర భద్రతా సంస్థల అధిపతుల ఉన్నతస్థాయి సమావేశంలో స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ వ్యూహంలో భాగంగా పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతు ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 'షహజాద్ భట్టి నెట్‌వర్క్'పై దేశవ్యాప్తంగా దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్లలో 100కు పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 300 మందికి పైగా కార్యకర్తలను అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌లు పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులున్న హ్యాండ్ గ్రెనేడ్లు, అక్రమ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 26న చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద మాదీచీను ఉగ్రవాద సంస్థగా కేంద్రం ప్రకటించినట్లు పేర్కొన్నారు.

విదేశాల నుంచి 73 మంది నిందితుల అప్పగింత

ఉగ్రవాదులకు విదేశాల్లో ఆశ్రయం లభించకుండా కేంద్రం దౌత్యపరమైన చర్యలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రత్యేక 'ఎక్స్‌ట్రాడిషన్ పోర్టల్'ను ప్రారంభించింది. గత ఏడాది కాలంలో వివిధ దేశాల నుంచి 73 మంది కీలక ఉగ్రవాద నిందితులను భారత్‌కు తీసుకొచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

పేలుడు పదార్థాల విక్రయాలపై నిఘా

బాంబుల తయారీలో ఉపయోగించే అమ్మోనియం నైట్రేట్ విక్రయాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. యువతలో ఉగ్రవాద భావజాలం వైపు మొగ్గుచూపే సంకేతాలు, ప్రవర్తనలో వచ్చే మార్పులపై కూడా నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు వెల్లడించారు. "ఎర్రకోట పేలుడు కేసు ప్రత్యేకమైనది. ఇందులో అత్యంత అర్హత కలిగిన నిపుణులు పాలుపంచుకున్నారు. ప్రస్తుతం అమ్మోనియం నైట్రేట్, ఇతర పదార్థాల విక్రయాలపై ఆకస్మిక తనిఖీలతో పాటు పలు నియంత్రణ చర్యలు అమల్లో ఉన్నాయి" అని ఓ అధికారి పేర్కొన్నారు.

పలు ఉగ్రవాద మాడ్యూళ్ల నిర్వీర్యం

కేంద్ర భద్రతా సంస్థలు దేశవ్యాప్తంగా పలు ఆపరేషన్లు నిర్వహించి ఉగ్రవాద మాడ్యూళ్లను నిర్వీర్యం చేసినట్లు తెలిపాయి. జైష్-ఎ-మొహమ్మద్ (జేవీ), లష్కరే-తైబా (రామ) వంటి నిషేధిత సంస్థలకు మద్దతుగా పనిచేస్తున్న వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఖలిస్థాన్ అనుకూల శక్తులపై కూడా చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్, ఖలిస్థాన్ జిందాబాద్ ఫోర్స్ వంటి సంస్థల నెట్‌వర్క్‌లను దెబ్బతీసినట్లు పేర్కొన్నారు. ఈ చర్యలతో సరిహద్దుల గుండా జరిగే ఆయుధాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటంతో పాటు, పలువురు కీలక వ్యక్తులు అరెస్టయ్యారని తెలిపారు. బంగ్లాదేశ్ కేంద్రంగా ఉన్న ఉగ్రవాద ముఠాలపైనా నిఘా పెంచారు. అసోం, పశ్చిమబెంగాల్, త్రిపుర, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో జమాత్-ఉల్-ముజాహిదీన్ బంగ్లాదేశ్ (జేవీబీ) భావజాలంతో ప్రభావితమైన 27 మంది కార్యకర్తలను అరెస్టు చేసినట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి.

పదేళ్లలోనే పెను మార్పు..
భారత్‌పై ప్రపంచ బ్యాంకు ప్రశంసలు

భారత్‌లో గత దశాబ్ద కాలంలో పేదరికం గణనీయంగా తగ్గిందని ప్రపంచ బ్యాంకు ప్రశంసించింది. ఈ విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు భారత్ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవచ్చని ఓ నివేదిక వెల్లడించింది. 2011లో దేశంలో అత్యంత పేదరికంలో ఉన్నవారి సంఖ్య 27.1 శాతంగా ఉండగా.. 2023 నాటికి అది 2.6 శాతానికి తగ్గినట్లు ప్రపంచ బ్యాంకు గణాంకాలు చెబుతున్నాయి. 'ది బిజినెస్ స్టాండర్డ్' ప్రచురించిన నివేదిక ప్రకారం.. భారత్ దాదాపు 49.6 కోట్ల మందిని తీవ్ర పేదరికం నుంచి బయటపడేసింది. అమెరికా, రష్యా దేశాల మొత్తం జనాభా కంటే ఇది ఎక్కువ. ప్రపంచంలో పేదరికం అత్యంత వేగంగా తగ్గిన దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచిందని నివేదిక పేర్కొంది. రోజుకు 4.2 డాలర్ల ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకునే దిగువ మధ్య ఆదాయ దేశాల పేదరిక ప్రమాణం ప్రకారం కూడా భారత్‌లో పేదరికం 2011లో 57.7 శాతం ఉండగా.. 2023 నాటికి 16.1 శాతానికి తగ్గింది. అయితే పేదరికాన్ని కొలిచే విధానాల్లో వచ్చిన మార్పులు కూడా ఈ గణాంకాలపై కొంత ప్రభావం చూపి ఉండొచ్చని ప్రపంచ బ్యాంకు స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా పేదరికం తగ్గుదల ఒకేలా లేదని నివేదిక తెలిపింది. ఉత్తరప్రదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు ఉన్న ప్రాంతంలోనే దేశంలోని పేదల్లో 57 శాతం మంది నివసిస్తున్నట్లు వెల్లడించింది.

కూటమికి వైసీపీ మధ్య బిగ్ గ్యాప్ ...బాబు చెప్పిన లెక్క !



ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి 58.9 శాతం ఓట్లు రాగా, వైసీపీకి 33.56 శాతం మాత్రమే వచ్చాయని చంద్రబాబు వెల్లడించారు. 2024తో పోలిస్తే కూటమి ఓటు షేర్ 3.6 శాతం పెరగగా, వైసీపీకి 6.25 శాతం తగ్గిందని తెలిపారు. ఇరు పక్షాల మధ్య ఓట్ల వ్యత్యాసం 25.34 శాతానికి చేరిందని వివరించారు. మరోవైపు ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని వైసీపీ ఆరోపిస్తోంది.ఏపీలో మూడు పార్టీలతో అధికార టీడీపీ కూటమి ఉంది. విపక్షంలో వైసీపీ ఒక్కటే ప్రతిపక్షంగా ఉంది. ఈ రెండు పార్టీల మధ్య ఓటు షేర్ గ్యాప్ 2024లో చూస్తే దాదాపుగా 15 శాతంగా ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అది కాస్తా పాతిక శాతంగా మారింది అని చంద్రబాబు అంకెలు లెక్కలతో సహా మొత్తం వివరించారు. ప్రస్తుతం లోకల్ బాడీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కూటమి వైసీపీల మధ్య 25 శాతం ఓటు షేర్ తేడా ఉందని వివరించారు. ఒక విధంగా చూస్తే ఇది అతి పెద్ద తేడానే. వైసీపీ బలం కూడా 2024 తో పోలిస్తే ఈసారి ఎన్నికల్లో బాగా తగ్గిపోయింది అని బాబు తనదైన విశ్లేషణ చేశారు.

ఎన్డీఏ బలం ఇదే :

ఏపీలో కూటమి పరిపాలన రెండున్నర ఏళ్ళకు చేరువ కావస్తున్న నేపథ్యంలో ఎన్డీయే బలం మరింతగా పెరిగింది అని బాబు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల ఫలితాల మీద ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో పట్టణాలు, పరిషత్ ఎన్నికల్లో కూటమి మొత్తంగా 58.9 ఓట్ల శాతాన్ని సాధించిందని అన్నారు. అదే 2024 ఎన్నికల్లో చూస్తే కూటమికి వచ్చిన ఓటు షేర్ 55.3 శాతం అని చెప్పారు. అలా చూసుకుంటే స్థానిక ఎన్నికల నాటికి ఎన్డీఏకు 3.6 శాతం ఓట్లు పెరిగాయని అన్నారు.

వైసీపీ తగ్గింది :

ఇక లోకల్ బాడీ ఎన్నికల్లో మొత్తంగా చూస్తే 33.56 శాతం ఓటు షేర్ మాత్రమే వైసీపీకి దక్కింది అని బాబు చెప్పారు. ఇదే వైసీపీకి 2024 ఎన్నికలలో 39.81 శాతం ఓటు షేర్ వచ్చిందని అన్నారు. అలా 2024 తో పోలిస్తే వైసీపీకి 6.25 శాతం ఓట్లు తగ్గాయని బాబు లెక్క ఎప్పారు. అలా చూస్తే టోటల్ గా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి వైసీపీకి మధ్య 25.34 శాతం మేర భారీ గ్యాప్ ఉందని తేల్చారు. ఇక పట్టణాలలో చూస్తే ఎన్డీఏ ఓట్ షేర్ 59.9 శాతంగా ఉంటే వైసీపీ ఓటు షేర్ 34.3 శాతంగా ఉందని అన్నారు. ఇక్కడ ఫలితాలు చూస్తే ఎన్డీఏ స్ట్రైక్ రేట్ 94 శాతం అని చెప్పారు.

పరిషత్తు ఎన్నికల్లో :

అదే విధంగా పరిషత్తు ఎన్నికల్లో చూస్తే జడ్పీటీసీ ఎన్నికల్లో ఎన్డీఏ ఓట్ షేర్ 57.6 శాతంగా ఉంటే వైసీపీ 39.7 శాతంగా ఉందని అన్నారు. అలా ఎన్డీఏ స్ట్రైక్ రేట్ 87.5 శాతంగా వచ్చిందని చెప్పారు. అలాగే పట్టణాల్లో 25.60 శాతం పల్లెల్లో 17.9 శాతం మేర కూటమికి వైసీపీకి మధ్య ఓట్ల శాతంలో తేడా ఉందని అన్నారు. అలాగే ఎంపీటీసీల ఎన్నికల్లో చూస్తే 9818 స్థానాలకు గానూ కూటమి 7803 స్థానాలు దక్కాయని బాబు చెప్పుకొచ్చారు. అలా రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం మండల అధ్యక్ష స్థానాలను కూటమి గెలుచుకునే అవకాశం ఉందని అన్నారు. ఏపీలో 28 జెడ్పీ పీఠాలలో వైసీపీ ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రమే గెలుచుకుందని మిగిలిన చోట కూటమే ఆధిపత్యం గా ఉందని బాబు విశ్లేషించారు.

వైసీపీకి భారీ లోటు :

బాబు చెప్పిన లెక్క ప్రకారం చూస్తే ఏపీలో వైసీపీకి ఓటు షేర్ 40 శాతం కాదు అని అది దాదాపుగా 34 శాతానికి పడిపోయింది అని అంటున్నారు. రెండున్నరేళ్ళ కాలంలో వైసీపీ

ఓటు షేర్ ఆరు శాతం తగ్గడం అన్నది కూటమి ప్రభుత్వం విజయంగా చెబుతున్నారు. అలాగే కూటమికి దాదాపుగా అదనంగా మరో నాలుగు శాతం ఓటు షేర్ పెరిగింది అని అంటున్నారు. ఈ లెక్కన పాతిక శాతం బిగ్ గ్యాప్ తో కూటమి వైసీపీ మధ్య ఏపీలో రాజకీయ పోరు సాగుతోంది అన్నది కూటమి వైపు నుంచి వినిపిస్తున్న మాట. అయితే తమకు నామినేషన్లు వేసుకునే చాన్స్ ఇవ్వలేదని ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని రిగ్గింగ్ అని వైసీపీ అంటోంది. మరి కూటమి బలం పెరిగిందా వైసీపీ తగ్గిందా అంటే అందుబాటులో ఒక్క ఓట్ల లెక్కలు ఇవే చెబుతున్నాయి. సో ఇప్పటికి అయితే కూటమి బాహుబలిగా మారింది అనే మూడు పార్టీల నేతలు గట్టిగా చెబుతున్నారు.

100 శాతం స్ట్రయిక్ రేట్.. కోటంరెడ్డి ఆశలు నెరవేరుతాయా?!



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటిరెడ్డి శ్రీధర్ రెడ్డి కి మంత్రి పీఠంపై ఆశ ఉంది. గత వైసీపీ హయాంలో ఆయన మంత్రి పీఠం దక్కించు కునేందుకు శత విధాల ప్రయత్నించారు. కానీ, జగన్ అవకాశం ఇవ్వలేదు. సామాజిక న్యాయం పేరుతో ఆయన కొత్తగా ఎన్నికైన వారికి.. అప్పటికప్పుడు పార్టీ తీర్థం పుచ్చు కున్నవారికి అవకాశం ఇచ్చారు. ఇదే చాలా మంది నాయకులకు ఆగ్రహం తెప్పించింది. ఫలితంగా వారంతా బయటకు వచ్చారు. ఇలా వచ్చిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి టీడీపీ కండువా కప్పుకొన్నారు. వాస్తవానికి కోటంరెడ్డి రాజకీయ ప్రవేశం చేసిన నాటి నుంచి .. అంటే, కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి కూడా టీడీపీకి వ్యతిరేకంగానే రాజకీయాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ తర్వాత ఆయన వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ క్రమంలోనే 2019-24 మధ్య వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే.. తనకు మంత్రి పదవి కావాలంటూ.. మీడియా ముందే చెప్పారు. అయినా.. జగన్ వినలేదు. ఆ తర్వాత రెండున్నరేళ్లకు మంత్రి వర్గ ప్రక్షాళన చేశారు. అప్పుడైనా తనకు మంత్రివర్గంలో చోటు ఇవ్వాలని కోరారు. అప్పుడు కూడా ఛాన్స్ చిక్కలేదు. ఈ కారణంగానే కోటంరెడ్డి వైసీపీని వీడి బయటకు వచ్చారు. ఇక, ఆ తర్వాత.. టీడీపీ టికెట్‌పై నెల్లూరు రూరల్ స్థానం నుంచే గత ఎన్నికల్లో విజయం దక్కించు కున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ కనుసన్నల్లో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడంలోనూ.. ప్రభుత్వం తరపున అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం లోనూ ముందున్నానని ఆయన చెబుతున్నారు. ఇక, స్థానికంగా ఎలాంటి ఆర్భాటాలకు పోకుండా.. ప్రజలను కలుసుకుంటూ.. వారి సమస్యలు కూడా వింటున్నారు.

కట్ చేస్తే..

తాజాగా జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థులను పూర్తిస్థాయిలో గెలిపించినట్టు తాజాగా కోటంరెడ్డి చెప్పుకొచ్చారు. నెల్లూరు రూరల్ నియోజక వర్గంలోని అన్ని ఎంపీటీసీలు, జడ్పీటీసీలు పూర్తిగా టీడీపీ వశ మయ్యాయన్నారు. తన నియోజకవర్గం పూర్తిగా టీడీపీకి కంచుకోటగా మారిందన్నారు. ప్రెస్‌మీట్ అనంతరం.. ఆఫ్‌ది రికార్డుగా మీడియా మిత్రులు.. --మీరు ఏం ఆశిస్తున్నారు?-- అని ప్రశ్నించగా.. తాను కొత్తగా చెప్పేది లేదంటూ..గతంలో తన మనసులో ఉన్న విషయాన్నే ఆయన చెప్పుకొచ్చారు. సో.. కోటంరెడ్డి మంత్రి పదవిని ఆశిస్తున్నారన్నది స్పష్టమైంది. మరి చంద్రబాబు ఏం చేస్తారో చూడాలి. కానీ, ప్రస్తుతం మంత్రి వర్గంలో నెల్లూరు జిల్లా నుంచి ఆనం రామ నారాయణరెడ్డి, పొంగూరు నారాయణలు ఉన్నారు.

ఏపీలో వరుస ఎన్నికలు...

విజయవాడ, నవంబర్ 9,

ఏపీలో వరసగా ఎన్నికలు జరుగుతున్నాయి. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఇప్పటికే ముగిశాయి. దీంతో ప్రభుత్వం మిగతా పంచాయతీ, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు కసరత్తు ప్రారంభమైంది. ఈ మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికలు ఒకే విడతలో జరగనున్నాయి. ఈ ఎన్నికలపై రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ అధికారులు స్పష్టమైన గైడ్‌లైన్స్‌ను కూడా ఇవ్వడం జరిగింది.ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సందడి నెలకొంది. ముందు మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు జరగ్గా.. తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు విజయవంతంగా ముగిశాయి. వీటికి సంబంధించిన ఫలితాలు కూడా వచ్చేశాయ్. దీంతో మిగిలిన ఎన్నికలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ని ఖరారు అయింది. ఇక ప్రాథమి వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఈ ఎలక్షన్‌ని ఒకే విడతలో నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఎ.బాబు శనివారం జిల్లా సహకార అధికారులకు స్పష్టమైన గైడ్‌లైన్స్‌ను జారీ చేశారు.అలాగే ఈ ఎలక్షన్ పనుల్లో ఎలాంటి ఆలస్యం, నిర్లక్ష్యం సహించేది లేదని కమిషనర్ తెలిపారు. కిందిస్థాయి అధికారులకు, ఎంప్లాయీస్‌కి ఎన్నికల నిర్వహిణతో పాటు చట్టపరంగా ఉన్న నిబంధనలపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. అంతేకాదు ఆదేశాలు అందిన పది రోజుల్లోగా వెంటనే సంబంధిత కార్యాచరణపై రిపోర్ట్ అందించాలని తెలియజేశారు. దీంతోపాటు రైతు సేవా కేంద్రాల వారీగా ప్రాథమిక ఓటర్ల లిస్టులను రెడీ చేసి, 'ఈ-పీఏసీఎస్ ఈఆర్‌పీ' పోర్టల్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించడం జరిగింది. అదేవిధంగా ఓటర్లకు అనుకూలంగా ఉండే పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ముందుగానే అంచనాకు రావాలని సూచించడం జరిగింది.ఈ కోపరేటివ్ సోసైటీ ఎన్నికలు ఒకే విడతలో జరగనున్నాయి. కాబట్టి దీనికి తగ్గట్టుగా బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి, ప్రింటింగ్ ప్రెస్‌ల లభ్యతపై ముందస్తు ప్లాన్ చేసుకోవాలని కమిషన్ సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లను గుర్తించి, చట్టపరమైన విషయాలపై పట్టున్న అధికారులను నియమించాలని చెప్పారు. దీంతోపాటు పోలింగ్ సిబ్బంది, జోనల్ అధికారులకు ట్రైనింగ్ ఇవ్వాలని, ఇతర శాఖల ఉద్యోగుల వివరాలను సేకరించాలని కూడా సూచించారు. ఎన్నికల నిర్వహణకయ్యే ఖర్చులను అంచనా వేయాలని అలాగే శాంతిభద్రతల ఏర్పాట్లను పర్యవేక్షించాలని సంబంధిత మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. కాగా ఇప్పటికే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ఖరారైంది. ఆ ఎన్నికలు వచ్చే నెల మొదటి వారంలోనే పూర్తి కానున్నాయి.

గ్రామాల్లో సందడి

రాష్ట్రంలో 13 వేల 219 పంచాయతీలకు పోలింగ్, కౌంటింగ్ నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధమైంది. ఈ నెల 13వ తేదీన ఎన్నికల షెడ్యూల్2ని అధికారికంగా రిలీజ్ చేయనున్నట్టు రాజుజ ప్రకటించింది. దీంతో మళ్లీ పొలిటికల్ హీట్ ఎక్కింది.పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో జరగనున్నాయి. ఈ మేరకు నవంబర్ 13న మొదటి దశ, 16న రెండో దశ, 19వ తేదీన మూడో దశకు నోటిఫికేషన్లను జారీ చేయనున్నారు. తొలివిడతలో భాగంగా నోటిఫికేషన్ 13న విడుదలైతే.. నవంబర్ 17వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుంది. నవంబర్

26న పోలింగ్ నిర్వహించి.. ఫలితాలను వెల్లడించడం జరుగుతుంది. రెండో విడతలో భాగంగా 16న నోటిఫికేషన్ రిలీజ్ చేస్తారు. నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ నవంబర్ 20. ఇక నవంబర్ 29న పోలింగ్, ఫలితాలు వెల్లడిస్తారు. అలాగే మూడో విడత నోటిఫికేషన్ 19న విడుదల కాగా.. నవంబర్ 23 వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుంది. ఫైనల్ పోలింగ్, ఫలితాలను డిసెంబర్ 2వ తేదీన వెల్లడించడం జరుగుతుంది.రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు చాలా కీలకంగానే ఉంటాయి. గ్రామాల్లో ఈ ఎన్నికల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తికరంగా ఉంటారు. ఈ పంచాయతీ ఎన్నికలు అధికారికంగా పార్టీల గుర్తులపై జరగకపోయినా.. కూటమి, వైసీపీ మద్దతుదారుల మధ్యే పోటీ తీవ్రంగా ఉంటుంది. రాష్ట్రంలో కొత్త గవర్నమెంట్ ఏర్పాటైన తర్వాత జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో అధికార, ప్రతిపక్షాలకు ఇవి అత్యంత కీలకం కానున్నాయి. మొత్తానికి పల్లె పోరుకు సిద్ధమైంది.

-పరిషత్- లెక్క తేలింది.. ఫైనల్ ఫలితం ఇదే!



ఏపీ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తుది ఫలితాలను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. 582 జడ్పీటీసీ స్థానాల్లో టీడీపీ 406 గెలుచుకోగా, వైసీపీ 76, జనసేన 73 స్థానాలు సాధించాయి. ఎంపీటీసీ ఫలితాల్లోనూ టీడీపీ 4,806 స్థానాలతో ముందంజలో నిలిచింది.

ఏపీలో ఈ నెల 5న జరిగిన మండల, జిల్లా పరిషత్ ఎన్నికల తుది ఫలితాలను ఆదివారం రాత్రి.. రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. సుమారు రెండు రోజుల పాటు జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆదివారం జరిగింది. దాదాపు అన్ని జిల్లాల్లోనూ పూర్తయినా.. మురసు తుఫాను ప్రభావిత జిల్లాల్లో మాత్రం కొంత ఆలస్యంగా ఓటింగ్ జరగడం.. అలానే కౌంటింగ్ విషయంలోనూ అధికారులు ఆచితూచి వ్యవహరించారు.దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం వంటి మురసు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆలస్యమైంది. దీంతో ఆదివారం రాత్రి 7 గంటల సమయానికి ఈ ప్రక్రియను పూర్తి చేసినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇక, ఇవే తుది ఫలితాలుగా పేర్కొంది. ఈ మేరకు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తుది ఫలితాలను రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా విడుదల చేయడం గమనార్హం.

జిల్లా పరిషత్‌లో ఎవరెవరికి ఎన్ని?

జిల్లా పరిషత్ స్థానాలు: 582
టీడీపీకి దక్కినవి: 406
వైసీపీ సొంతం చేసుకున్నవి: 76
జనసేన గెలుచుకున్నవి: 73
బీజేపీ గెలిచినవి: 6
సీపీఎం పార్టీ: 1
ఇండిపెండెంట్లు: 6

మండల పరిషత్‌లో ఏ పార్టీకి ఎలా..?

రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీటీసీ స్థానాలు: 7768

టీడీపీ సొంతం చేసుకున్నవి 4,806
వైసీపీ దక్కించుకున్నవి : 1711
జనసేన గెలిచినవి: 938
బీజేపీ హవా: 117
కాంగ్రెస్ : 9
సీపీఎం: 15

మారిన ఫలితం..

తుది లెక్కింపునకు.. గతంలో అంటే శనివారం లెక్కిస్తున్న సమయంలో వచ్చిన ఫలితానికి మధ్య వ్యత్యాసం కనిపించింది. బాపట్ల జిల్లా చీరాలలో కాంగ్రెస్ పార్టీ 10 ఎంపీటీసీ స్థానాలను సొంతం చేసుకున్నట్టు వార్తలు వచ్చాయి. కానీ, తుది ఫలితం వచ్చే సరికి 9 స్థానాలకే పరిమితం అయింది. అలానే.. బీజేపీ మండల పరిషత్‌లో 125 స్థానాలు గెలుచుకున్నట్టు ఫలితాలు వచ్చినా.. తుది ఫలితం 8 స్థానాలు వైసీపీకి సొంతమయ్యాయి. ఇక, జనసేన, వైసీపీలలోనూ ఈ మార్పులు స్వల్పంగా కనిపించాయి. మొత్తంగా తుది ఫలితం వచ్చే సరికి.. కూటమి ఐక్యంగా సాధించిన సీట్లతో పోల్చి తే వైసీపీ తెల్లబోయిందనే చెప్పాలి.

నగరాలు.. పట్టణాల్లో..

స్థానిక మునిసిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికలు ముగియడం, అలానే తాజాగా జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు కూడా ముగియడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం కోడ్ ను ఎత్తి వేసింది. నగరాలు, పట్టణాల్లో యధావిధిగా ప్రభుత్వ అధికారు ల ఆదేశాల మేరకు కార్యకలాపాలు నిర్వహించనున్నారు. అయితే.. ఈ నెల 15 నుంచి గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాలతో సరిహద్దులు ఉండే పట్టణ ప్రాంతాలు, నగర ప్రాంతాల్లోని కొన్ని చోట్ల ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది. కాగా.. డిసెంబరు 3వ తేదీ వరకు గ్రామ పంచాయతీ సమరం జరగనుంది.

పరిషత్ ఎన్నికల్లో అంచనాలు తారుమారు...

నెల్లూరు, నవంబర్ 9,

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కూటమి పార్టీలకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయి. మున్సిపల్ ఎన్నికల్లో కనిపించిన ఆధిపత్యం పరిషత్ ఎన్నికల్లోనూ కొనసాగడంతో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఉత్తరాంధ్ర నుంచి కోస్తాంధ్ర వరకు, గోదావరి జిల్లాల నుంచి రాయలసీమ వరకు కూటమి అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో విజయం సాధించారు. అధికారికంగా పార్టీ తరఫున బరిలో నిలిచిన అభ్యర్థులతో పాటు టికెట్లు దక్కక స్వతంత్రులుగా పోటీ చేసిన కూటమి నాయకులు కూడా గెలవడం ఈ ఎన్నికల్లో ప్రత్యేకంగా కనిపించింది.సాధారణంగా ఒకే పార్టీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉంటే ఓట్లు చీలిపోయి ప్రత్యర్థి పార్టీకి ప్రయోజనం కలుగుతుందని రాజకీయ వర్గాలు భావిస్తుంటాయి. ఈ ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి తమకు అనుకూలిస్తుందని వైసీపీ నాయకత్వం ఆశించి ఉండవచ్చు. అయితే ఫలితాలు మాత్రం అందుకు భిన్నంగా వచ్చాయి. అధికారిక అభ్యర్థితో పాటు రెబల్‌గా పోటీ చేసిన నాయకుల్లో ఒకరిని ఓటర్లు ఆదరించారు. కొన్ని ప్రాంతాల్లో ఇద్దరు కూటమి అభ్యర్థుల మధ్య పోటీ ఉన్నప్పటికీ వైసీపీకి ఆశించిన స్థాయిలో ప్రయోజనం దక్కలేదు.నెల్లూరు జిల్లాలోని ఇందుకూరుపేట, జలదంకి, ఆత్మకూరు, వెంకటాచలం మండలాల్లో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. వీరంతా తెలుగుదేశం పార్టీనుంచి టికెట్ ఆశించి, అవకాశం దక్కకపోవడంతో స్వతంత్రులుగా బరిలోకి దిగినవారే కావడం గమనార్హం. శ్రీకాకుళం జిల్లాలోనూ రెబల్ అభ్యర్థుల ప్రభావం స్పష్టంగా కనిపించింది. అక్కడ ఏకంగా 16 మంది స్వతంత్రులు గెలుపొందగా, వారిలో అత్యధికులు టీడీపీకి చెందినవారే కావడం పార్టీ స్థానిక బలాన్ని సూచిస్తోంది.తిరుపతి జిల్లాలో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. వీరిలో ఐదుగురు టీడీపీకి, మరొకరు జనసేన పార్టీకి చెందిన రెబల్ అభ్యర్థిగా ఉన్నారు. కాకినాడలో ఐదుగురు, పిఠాపురంలో ఒకరు, తూర్పుగోదావరి జిల్లాలో నలుగురు టీడీపీ, జనసేన తిరుగుబాటు అభ్యర్థులు గెలిచారు. విజయనగరం జిల్లాలో పరిస్థితి మరింత ఆసక్తికరంగా మారింది. అక్కడ ఏకంగా 28 మంది స్వతంత్ర అభ్యర్థులు విజయాన్ని అందుకున్నారు. కృష్ణా జిల్లాలో కూడా ఎనిమిది మంది స్వతంత్రులు తమ సత్తా చాటారు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు అందిన ఫలితాల ప్రకారం 66 స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. తుది లెక్కల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. వీరిలో అధిక శాతం మంది కూటమి పార్టీలకు చెందిన అసంతృప్త నాయకులు కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ గుర్తుపై పోటీ చేసిన అభ్యర్థులకు మాత్రమే కాకుండా, స్వతంత్రులుగా బరిలోకి దిగిన నాయకులకు కూడా ప్రజల మద్దతు లభించడం స్థానిక రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది.ఈ ఫలితాలు వైసీపీకి మాత్రం ఆశించిన ఊరటనివ్వలేకపోయాయి. కూటమి అభ్యర్థుల మధ్య పోటీ కారణంగా ఓట్లు చీలి తమకు అవకాశాలు వస్తాయని భావించిన నాయకులకు ఫలితాలు నిరాశ కలిగించాయి. స్థానిక స్థాయిలో అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం, ప్రజలతో ఉన్న సంబంధాలు కూడా విజయాల్లో కీలక పాత్ర పోషించాయి. మొత్తంగా పరిషత్ ఎన్నికలు కూటమి పార్టీలకు బలమైన రాజకీయ సంకేతాన్ని ఇచ్చాయి. అధికారిక అభ్యర్థులైనా, రెబల్స్ అయినా కూటమి శిబిరం నుంచే ఎక్కువ విజయాలు రావడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

సంపాదకీయం


అనంతం.. అపోహ!

నవంబర్ 13, 2026 దగ్గరపడుతున్న కొద్దీ సామాజిక మాధ్యమాల్లో ఒకే ప్రశ్న తిరుగుతోంది: ప్రపంచం అంతమవుతుందా? ప్రళయ భయాలు ప్రతి కొన్నేళ్లకూ పుట్టుకొస్తూనే ఉంటాయి. కానీ ఈసారి వాటికి ఒక శాస్త్రీయ ముసుగుంది. ఈ తేదీని చెప్పింది జ్యోతిష్కులు కాదు, ప్రముఖ సైన్స్ పత్రికలో ప్రచురితమైన పరిశోధన. 1960 నవంబర్ 4న అమెరికాలోని సైన్స్ పత్రిక 'డూమ్స్‌డే: ఫ్రైడే, నవంబర్ 13, ఏడీ 2026' అనే పేరుతో ఒక అధ్యయనాన్ని ప్రచురించింది. ఆస్ట్రియన్-అమెరికన్ శాస్త్రవేత్త హైన్జ్ వాన్ ఫోర్‌స్టర్ ఈ పరిశోధనకు నాయకత్వం వహించారు. ఇల్లినాయి వర్శిటీలో పనిచేసిన ప్యాట్రిషియా మోరా, లారెన్స్ అమియట్ ఆయనకు తోడుగా ఉన్నారు. వీరు క్రీస్తుశకం ఆరంభం నుంచి 1958 వరకు అందుబాటులో ఉన్న 24 జనాభా అంచనాలను పరిశీలించారు. జనాభా ఒకే వేగంతో పెరగదని, పెరిగే కొద్దీ ఆ పెరుగుదల వేగం పెరుగుతుందని భావించారు. దీన్ని 'హైపర్‌బోలిక్ గ్రోత్' అంటారు. మనుషులు కలిసి పనిచేయడం, ఒకరికొకరు సాయం చేసుకోవడం, సమాజాలు ఏర్పరచుకోవడం వల్ల ప్రకృతి పెట్టే పరిమితులను అధిగమిస్తారని వారి నమూనా చెప్పింది. ఆ లెక్క ప్రకారం 2026 నవంబర్ మధ్యలో జనాభా 'అనంతం' అనే గణిత బిందువుకు చేరుతుంది. అసలు ఈ తేదీ ఎంపికలో ఒక చమత్కారం కూడా ఉందని పరిశోధకులు చెబుతారు. నవంబర్ 13 వాన్ ఫోర్‌స్టర్ పుట్టినరోజు కాబట్టి దాన్ని సరదాగా ఎంచుకున్నారని అంటారు. ఇక్కడ అర్థం చేసుకోవాల్సిన విషయం ఒక్కటే. 'అనంతం' అంటే భూమిపై అంతులేనంత మంది ప్రజలు ఉంటారని కాదు. ఒక ఫార్ములాను సుదూర భవిష్యత్తు వరకు లాగి, పరిస్థితులేవీ మారవని అనుకుంటే వచ్చే గణిత ఫలితమే అది. ఆ ఫార్ములా చెల్లని చోటును చూపించే సంకేతం మాత్రమే. పర్యావరణం, వనరులు, జనన-మరణాల రేట్లను పట్టించుకోకుండా ఈ లెక్కను అమలు చేయలేమని పరిశోధకులకు కూడా తెలుసు. 'డూమ్స్‌డే' అనే పదం ఇక్కడ జనాభా పెరుగుదల ఎంత భయంకరంగా ఉండవచ్చో చెప్పడానికి వాడిన హెచ్చరిక భాష మాత్రమే. దాన్ని ప్రపంచం అంతమయ్యే ముహూర్తంగా చదవడం పెద్ద పొరపాటు.

అయితే నేటి సామాజిక మాధ్యమాల యుగంలో అపోహలు నిజంకంటే వేగంగా ప్రయాణిస్తాయి. ఈ కథకు మరో మలుపు ఈజిప్ట నుంచి వచ్చింది. 1964 నవంబర్ 29న 'పతానీ' అనే ఈజిప్ట వార్తాపత్రికలో మిషెల్ టెక్లా రాసిన ఒక కథనం ప్రచురితమైందని చెబుతారు. ఇటీవల దాని ప్రతి బయటపడింది. 2026 నవంబర్ 13న ప్రపంచం అంతమవుతుందని ఆ కథనం శీర్షికలో ఉందంటూ ఈజిప్ట్‌లోని పలు మీడియా సంస్థలు దాన్ని మళ్లీ ప్రచురించాయి. ఆరు దశాబ్దాల తర్వాత అది సంచలనంగా మారింది. కానీ ఇక్కడ ఒక తేడాను గుర్తించాలి. ఒక పత్రికలో వచ్చిన వ్యాసం వేరు, శాస్త్రీయ అధ్యయనం వేరు. తేదీని ప్రస్తావించిన పరిశోధనను వాన్ ఫోర్‌స్టర్ బృందం చేసింది, టెక్లా కాదు. టెక్లా వ్యాసంలో అసలు ఏముందో పూర్తిగా చదివి, శాస్త్రీయ అధ్యయనంతో పోల్చకుండా అన్నింటినీ ఒకే గాటన కట్టడం సరైంది కాదు. ఇప్పుడు వినిపిస్తున్న వాదనల్లో కొన్ని జనాభా లెక్కలను, మరికొన్ని సౌర కార్యకలాపాలను, వాతావరణ మార్పులను, ప్రకృతి విపత్తులను కలిపి భయపెడుతున్నాయి. ఇందులో 'సోలార్ యాక్టివిటీ' వాదన అందరినీ ఎక్కువగా ఆకర్షిస్తోంది. అసాధారణ సౌర కార్యకలాపాల వల్ల ఆ రోజున భూ అయస్కాంత క్షేత్రం దెబ్బతింటుందని ప్రచారం చేస్తున్నారు. నిజానికి సౌర తుపానులు కొత్త విషయం కాదు. సూర్యుడి కార్యకలాపాలు సుమారు 11 ఏళ్ల చక్రంలో పెరుగుతూ, తగ్గుతూ ఉంటాయి. ఇప్పుడు నడుస్తున్న 25వ సౌర చక్రం 2019 డిసెంబర్‌లో మొదలైంది. తాజా పరిశీలనల ప్రకారం దాని గరిష్ఠ స్థాయి 2024 అక్టోబర్‌లో వచ్చినట్లు భావిస్తున్నారు. అప్పటి నుంచి కార్యకలాపాలు క్రమంగా తగ్గుతున్నాయి. అయినా తగ్గుదల దశలోనూ బలమైన సౌర జ్వాలలు, తుపానులు వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 2026 ఫిబ్రవరిలో కూడా శక్తివంతమైన సౌర జ్వాల నమోదైంది. ఇవి ఉపగ్రహాలకు, నావిగేషన్ వ్యవస్థలకు, విద్యుత్ గ్రిడ్లకు అంతరాయం కలిగించగలవు. అందుకే శాస్త్రవేత్తలు వీటిని నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. కానీ ఇది ఒక నిర్దిష్ట తేదీన భూమిని సూర్యుడు నాశనం చేస్తాడనే వాదనకు ఆధారం కాదు. ఖగోళ శాస్త్రవేత్త ఇమాద్ ముజాహిద్ చెప్పినట్లు, నవంబర్ 13న భూమికి ముప్పు కలిగించే ఖగోళ సంఘటనేదీ జరగదు. ఈ తేదీపై ప్రచారం ఖగోళ నిపుణుల హెచ్చరికల నుంచి వచ్చింది కాదు. శాస్త్రీయ ఆధారాలు లేకుండా కొందరు వ్యక్తులు, సంస్థలు దాన్ని వ్యాప్తి చేస్తున్నారు. సౌర కార్యకలాపాలకూ, వాన్ ఫోర్‌స్టర్ పరిశోధనకూ ఎలాంటి సంబంధం లేదు.

మరి ఆ 1960 నాటి లెక్క ఎందుకు నిజం కాలేదు? కారణం సులువే. గతంలో కనిపించిన పెరుగుదల ఎప్పటికీ అలాగే కొనసాగుతుందని అది అనుకుంది. కానీ మనిషి సమాజం ఒకే దారిలో నడవదు. విద్య పెరిగింది, ఆరోగ్య సేవలు మెరుగయ్యాయి, నగరీకరణ పెరిగింది, కుటుంబ నియంత్రణ అవగాహన విస్తరించింది, ముఖ్యంగా మహిళలకు చదువు, ఉపాధి అవకాశాలు పెరిగాయి. వీటి ప్రభావంతో పిల్లల సంఖ్య తగ్గింది. ప్రపంచ జనాభా పెరుగుదల రేటు 1960లలోనే అత్యధిక స్థాయికి చేరి, ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఆ అధ్యయనం వచ్చిన నాటికి ప్రపంచ జనాభా సుమారు 300 కోట్లు. నేడు 800 కోట్లు దాటింది. అంటే మనుషులు గణనీయంగా పెరిగారు. అయినా వారి సమీకరణం చూపిన 'అనంతం' దరిదాపులకైనా చేరలేదు. ఐక్యరాజ్యసమితి 'వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్ 2024' నివేదిక ప్రకారం, 2024లో సుమారు 820 కోట్లు ఉన్న జనాభా 2080ల మధ్య నాటికి దాదాపు 1,030 కోట్ల గరిష్ఠ స్థాయికి చేరుతుంది. ఆ తర్వాత నెమ్మదిగా తగ్గి, 2100 నాటికి సుమారు 1,020 కోట్లకు చేరుతుంది. అంటే ఈ శతాబ్దంలోనే మన జనాభా శిఖరాన్ని తాకే అవకాశం ఉంది. ఈ కథ మనకు మూడు పాఠాలు చెబుతుంది. మొదటిది, గణిత నమూనాలు ఊహలపై నిలబడతాయి, ఆ ఊహలు మారితే ఫలితాలూ మారతాయి. రెండోది, ఆకర్షణీయమైన శీర్షికను చూసి అసలు విషయం చదవకుండా నమ్మడం ప్రమాదకరం. మూడోది, మీడియా సంస్థలు పాత కథనాలను మళ్లీ తవ్వి ప్రచురించేటప్పుడు సందర్భాన్ని, ఆధారాలను స్పష్టంగా చెప్పాలి. కాబట్టి ఈ శుక్రవారం భయపడాల్సింది ఏమీ లేదు. అది మరో సాధారణ రోజే. కావాల్సింది ఒక్కటే: ప్రతి వైరల్ సమాచారాన్ని 'ఆధారం ఏంటి?' అని ప్రశ్నించే అలవాటు. ఆ అలవాటు ఉంటే ఏ తేదీ మనల్ని భయపెట్టలేదు!

పనికొచ్చే పలుకు



శిఖరంమీద చలి!

ఎత్తుకు వెళ్లే కొద్దీ గాలి పలుచబడుతుంది. పర్వతారోహకులకు ఇది తెలుసు. జీవితంలో ఎదిగేటప్పుడు కూడా ఇలాగే జరుగుతుంది. విజయం పెరిగే కొద్దీ మన చుట్టూ ఉండే మనుషులు తగ్గుతారు. దీన్ని కథతో చూద్దాం. ఒక చిన్న ఊరి నుంచి వచ్చిన యువకుడు (ఇది ఉదాహరణ కోసం చెప్పే కథ) ఏళ్ల తరబడి కష్టపడి మంచిస్థాయికి చేరాడు. పండగకు ఊరికి వెళ్తే పాత స్నేహితులు "నువ్వు మారిపోయావురా" అన్నారు. ఇంట్లో తన ఒత్తిడి గురించి చెప్పబోతే, "నీకేం, బాగానే ఉన్నావు కదా" అని తేలిగ్గా తీసుకున్నారు. తిరిగి వచ్చేటప్పుడు అతను మనసులో అనుకున్నాడు: "అందరి మధ్యలో ఉన్నా నేనొక్కడినే ఉన్నాను."

ఇలా ఎందుకు జరుగుతుంది?

దీనికి మూడు కారణాలు ఉన్నాయి.

ఆలోచనల దూరం: మీ బాధ్యతలు, నిర్ణయాల బరువు పెరుగుతాయి. ఆ బరువు అనుభవించని వారికి అర్థం కాదు.

ప్రాధాన్యతల మార్పు: మీ సమయం, మాటలు, లక్ష్యాలు మారతాయి. పాత స్నేహితులకు అది "దూరం"లా కనిపిస్తుంది.

పోలిక: కొందరు మీ విజయాన్ని చూసి తమ లోటును గుర్తు చేసుకుంటారు. అప్పుడు వారికి మీతో మాట్లాడటం కష్టమవుతుంది. ఇందులో ఎవరి తప్పూ లేదు. ఇది ఎదుగుదలలో సహజంగా వచ్చే మార్పు. మరి, ఈ ఒంటరితనాన్ని ఎలా వాడుకోవాలి?

ఒంటరితనాన్ని ఏకాంతంగా మార్చుకోండి. ఒంటరితనం అంటే లోటు, ఏకాంతం అంటే ఎంపిక. రోజులో ఒక గంట ఫోన్ లేకుండా గడపండి. చదవండి, రాయండి, మీ లక్ష్యాల గురించి ఆలోచించండి. గొప్ప ఆలోచనలు చాలావరకు ఇలాంటి నిశ్శబ్ద క్షణాల్లోనే పుడతాయి.

కొత్త తోటి ప్రయాణికులను వెతకండి. మీ స్థాయి సమస్యలు తెలిసినవారు ఎక్కడో ఉంటారు. మీకంటే ముందు నడిచిన గురువులు, మీతో సమానంగా నడుస్తున్న సహచరులు, మీ వెనుకొచ్చే యువకులు. ఇలాంటి వారితో నెలకు ఒక్కసారైనా మనసు విప్పి మాట్లాడండి.

పాత బంధాలను వదలకండి, కానీ అంచనాలు మార్చుకోండి. ప్రతి ఒక్కరూ మిమ్మల్ని పూర్తిగా అర్థం చేసుకోవాలని ఆశించకండి. స్నేహితుడు స్నేహితుడిగా, కుటుంబం కుటుంబంగా మీ జీవితంలో ఉంటే చాలు. వారానికి ఒక ఫోన్ కాల్ చేయండి. మీ గురించి చెప్పడం కంటే వారి గురించి అడగండి. బంధాలు ఇలాగే నిలుస్తాయి.

మీ ప్రయాణాన్ని పంచుకోండి. మీ అనుభవాలను రాయండి లేదా చిన్న సమూహాలకు చెప్పండి. మీరు ఇతరులకు మార్గం చూపినప్పుడు, మీకు అర్థం చేసుకునే మనుషులు దొరుకుతారు.

శరీరాన్ని కూడా చూసుకోండి. నిద్ర, నడక, వ్యాయామం ఒంటరితనం భారాన్ని చాలా తగ్గిస్తాయి. మనసు బరువెక్కినప్పుడు శరీరం బలంగా ఉంటే నిలబడగలం.

చివరి మాట..

ఒంటరితనం భారంగా మారి, రోజువారీ జీవితాన్ని దెబ్బతీస్తోందని అనిపిస్తే, మీకు నమ్మకమైన వారితో లేదా కౌన్సెలర్‌తో మాట్లాడటానికి సంకోచించకండి. సహాయం కోరడం బలహీనత కాదు, తెలివైన నిర్ణయం.

శిఖరం మీద చలి ఉంటుంది. కానీ అక్కడి నుంచి కనిపించే దృశ్యం, కిందివారికి ఎప్పటికీ కనిపించదు. కాబట్టి ఆగకండి. చలిని తట్టుకోవడానికి వెచ్చని దుస్తులు, తోడుగా కొందరు సహచరులు, లోపల ఒక చిన్న దీపం.. ఇవి ఉంటే చాలు, ప్రయాణం సాగుతూనే ఉంటుంది.


ఇరాన్‌పై ట్రంప్ వెనకడుగు?



అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాజకీయ ప్రయాణంలో కీలక మలుపుగా మారాయి. ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ డెమోక్రాట్లు పట్టు సాధించారు. దీంతో శ్వేతసౌధం, సెనేట్, ప్రతినిధుల సభ.. ఈ మూడింటిపై రిపబ్లికన్లకు ఇన్నాళ్లూ ఉన్న ఆధిపత్యం ముగిసింది. ఎన్నికలకు ముందు సెనేట్‌లో రిపబ్లికన్లకు 53--47 ఆధిక్యం ఉండేది. ఈసారి ఏడు స్థానాలు డెమోక్రాట్ల చేతికి వెళ్లాయి. టెక్సాస్, సౌత్ కరోలినా వంటి సంప్రదాయ రిపబ్లికన్ కంచుకోటల్లోనూ ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఎన్నికల్లో 12 కోట్లకు పైగా ఓట్లు పోలవడం ఒక రికార్డు. ప్రజల్లో ఎంత ఆగ్రహం, ఎంత ఆసక్తి ఉన్నాయో ఇది చెబుతోందని విశ్లేషకులు అంటున్నారు. ఓటు వేసిన వారిలో గణనీయమైన భాగం ట్రంప్‌పై వ్యతిరేకత చూపడానికే ఓటు వేశామని ఎగ్జిట్ పోల్ సర్వేల్లో చెప్పారు. ఈ ఫలితాల తర్వాత ట్రంప్ మాటల్లో మార్పు కనిపిస్తోంది. ముఖ్యంగా ఇరాన్ విషయంలో ఆయన కొంత వెనక్కి తగ్గినట్లు సంకేతాలు ఇస్తున్నారు. ఇరాన్ అణు కార్యక్రమంపై ఒప్పందం కుదిరి, ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటే.. ఆ దేశంపై మళ్లీ దాడులు చేసే అవకాశం చాలా తక్కువని ఆయన తాజాగా చెప్పారు. కానీ వెంటనే ఒక హెచ్చరికనూ జోడించారు. చర్చలు విఫలమైతే దాడులకు వెనకాడబోమని, మూడు విమాన వాహక నౌకలు సిద్ధంగా ఉన్నాయని, కొన్ని గంటల్లోనే ఇరాన్‌లోని 38 వంతెనలను ధ్వంసం చేయగలమని అన్నారు. ఒకవైపు శాంతి మాట, మరోవైపు బెదిరింపు.. ఈ ద్వంద్వ శైలి ట్రంప్‌కు కొత్త కాదు. అయినా ఈసారి ఆయన ప్రకటనల్లో 'ఒప్పందం' అనే పదానికి ఎక్కువ ప్రాధాన్యం కనిపిస్తోంది. కారణం లేకపోలేదు. ఈ యుద్ధం అమెరికాకూ, ప్రపంచానికీ భారీ మూల్యాన్నే మిగిల్చింది. ఈ ఏడాది ఆరంభంలో మొదలైన ఘర్షణల్లో హర్మూజ్ జలసంధి చాలాకాలం స్తంభించిపోయింది. ఒక దశలో చమురు ధరలు బ్యారెల్‌కు వంద డాలర్లు దాటాయి. ఇంధన ధరల భారం సామాన్యుల జేబులపై పడి అసంతృప్తిని పెంచిందన్న విశ్లేషణలు ఉన్నాయి.

యుద్ధాన్ని ముగించేందుకు ఇప్పటివరకు జరిగిన ప్రయత్నాలు పూర్తి ఫలితాన్ని ఇవ్వలేదు. ఏప్రిల్‌లో పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. జూన్‌లో 60 రోజుల మధ్యంతర ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం హర్మూజ్ గుండా నౌకల రాకపోకలకు రుసుము లేకుండా అనుమతి ఇవ్వాలి. అమెరికా తన దిగ్బంధనాన్ని ఎత్తివేయాలి. కానీ జులైలో చమురు నౌకలపై దాడులు జరిగాయి. దీనికి ఇరాన్ కారణమని అమెరికా ఆరోపించింది. అంతే, ఒప్పందం కుప్పకూలింది. మళ్లీ దాడులు, ప్రతిదాడులు మొదలయ్యాయి. ఆ ఒప్పందంలోని అస్పష్టమైన నిబంధనలే దాని వైఫల్యానికి కారణమన్న విమర్శలూ వినిపించాయి. ఇప్పుడు ఖతార్ రంగంలోకి దిగి కొత్త ప్రతిపాదనలతో మధ్యవర్తిత్వం నడుపుతోంది. ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ అల్ థానీతో ట్రంప్ సోమవారం భేటీ కానున్నారని తాజా సమాచారం. ఇది శాంతి యత్నాల్లో కీలక ఘట్టంగా కనిపిస్తోంది. ఇరాన్ ఆలోచన మాత్రం ఇంకా స్పష్టంగా లేదు. ట్రంప్ పార్టీ ఓటమి టెహ్రాన్‌కు నైతిక బలాన్ని ఇచ్చిందన్న అభిప్రాయం ఉంది. అందువల్ల చర్చల్లో ఇరాన్ పెద్దగా రాయితీలు ఇస్తుందని ఆశించలేం. ఇక్కడే అమెరికా రాజకీయాల్లో 'లేమ్ డక్ విండో' ప్రస్తావన వస్తోంది. కొత్తగా ఎన్నికైన సభ్యులు వచ్చే ఏడాది జనవరిలో ప్రమాణ స్వీకారం చేసే వరకు ప్రస్తుత కాంగ్రెస్‌లో రిపబ్లికన్ల మెజార్టీ కొనసాగుతుంది. అంటే సుమారు రెండు నెలలు ట్రంప్‌కు ఇంకా చేతినిండా అధికారం ఉంది. చరిత్ర చూస్తే, మధ్యంతర ఓటమి తర్వాత అధ్యక్షులు ఈ కాలాన్ని వాడుకున్న ఉదాహరణలు ఉన్నాయి. 1994లో బిల్ క్లింటన్ వివాదాస్పద 'గాట్' వాణిజ్య ఒప్పందాన్ని ఇదే కాలంలో ఆమోదింపజేశారు. 2010లో బరాక్ ఒబామా రష్యాతో 'న్యూ స్టార్ట్' అణ్వాయుధ కుదింపు ఒప్పందానికి కాంగ్రెస్ ఆమోదం సాధించారు. 2014లో క్యూబాతో దౌత్య సంబంధాల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. ట్రంప్ స్వయంగా 2018లో సిరియా నుంచి సైన్యాన్ని పూర్తిగా ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించారు. మధ్యంతర ఓటమి తర్వాత అధ్యక్షులు అనూహ్య నిర్ణయాలు తీసుకోవడం అమెరికా చరిత్రలో కొత్త కాదని ఇవి చెబుతున్నాయి.

మరి ఈ రెండు నెలల్లో ట్రంప్ ముందున్న మార్గాలేమిటి? ఆయన పాలన చాలావరకు ఒబామా నిర్ణయాలకు వ్యతిరేకంగా సాగినట్లు కనిపిస్తుంది. ఒబామా హయాంలో ఇరాన్, క్యూబాలతో సంబంధాలు మెరుగుపర్చుకునే ప్రయత్నాలు జరిగాయి. ట్రంప్ శైలి దీనికి పూర్తి భిన్నం. అందుకే ఆయన ముందు ఈ రెండు దేశాలే బలమైన ఆప్షన్లుగా కనిపిస్తున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఇరాన్‌పై పరిమిత స్థాయిలో దాడులు చేసి 'విజయం సాధించాం' అని ప్రకటించుకోవడం సులువైన దారిగా కొందరు భావిస్తున్నారు. మరింత తీవ్రమైన చర్యలవైనా ఊహాగానాలు ఉన్నాయి. ఇరాన్ తన అణు స్థావరాల వద్ద ప్రజలకు అయోడిన్ బిళ్లలు పంచుతోందన్న వార్తలు ఆ భయాలకు అద్దం పడుతున్నాయి. అయితే ఇవన్నీ అంచనాలే తప్ప ఖరారైన నిర్ణయాలు కావు. మరోవైపు, ఆర్థికంగా చితికిపోయిన క్యూబా ఆయనకు సులువైన లక్ష్యం కావచ్చన్న చర్చ కూడా ఉంది. వెనెజువెలాలో మాదిరిగా సైనిక చర్యకు దిగుతారా, లేక అమెరికా కంపెనీలకు అవకాశాలు ఇచ్చేలా అక్కడి ప్రభుత్వాన్ని ఒప్పించి చమురు సరఫరాను పునరుద్ధరిస్తారా అన్నది ప్రశ్నార్థకం. ఇరాన్‌తో ఇప్పటికే ఘర్షణలో ఉన్న అమెరికా మరో సైనిక చర్య జోలికి వెళ్లకపోవచ్చన్నది ఎక్కువమంది అంచనా. ఒక విషయం మాత్రం స్పష్టం. ఇకపై ట్రంప్ నిర్ణయాలు ఎవరికీ జవాబుదారీ కాని వ్యవహారంగా ఉండవు. కాంగ్రెస్‌లో డెమోక్రాట్లకు ఇప్పుడు బడ్జెట్ చర్చల్లో పైచేయి ఉంటుంది. విచారణలు జరిపే అధికారం, కీలక నియామకాలను అడ్డుకునే అవకాశం వారికి లభిస్తాయి. ప్రజలు కోరుకుంటున్నది యుద్ధాల కొనసాగింపు కాదు, ధరల నుంచి ఉపశమనం, ప్రశాంతత అని ఎన్నికల తీర్పు చెబుతోందన్నది సాధారణ అభిప్రాయం. ఈ పరిణామాలు భారత్‌కు కూడా కీలకమే. మన ముడి చమురు అవసరాల్లో పెద్ద భాగం గల్ఫ్ నుంచే వస్తుంది. అక్కడ ఉపాధి పొందుతున్న లక్షలాది భారతీయుల్లో, ముఖ్యంగా తెలుగు కుటుంబాల్లో ఈ యుద్ధం ఆందోళన రేపింది. అందువల్ల యుద్ధం ఎంత త్వరగా ముగిస్తే అందరికీ అంత మేలు. అయితే కాగితంపై కుదిరే ఒప్పందం సరిపోదు. గత ఒప్పందం కూలిన అనుభవం చూపినట్లు, స్పష్టమైన నిబంధనలు, ఇరు పక్షాల చిత్తశుద్ధి ఉన్నప్పుడే శాంతి నిలుస్తుంది. ట్రంప్ మాట నిజంగా వెనకడుగా, లేక కొత్త ఎత్తుగడా అన్నది రానున్న రెండు నెలలు తేల్చనున్నాయి. ■




పని చేస్తున్నప్పుడు మీ ఆలోచనలన్నీ పనిపైనే ఉండాలి. కుటుంబంతో గడిపేటప్పుడు ఫోన్‌లు, బాధ్యతలు, ఇతర ఆలోచనలను పక్కనపెట్టి వారితో మనస్ఫూర్తిగా సమయం గడపాలి. విశ్రాంతి తీసుకునే వేళ మనసుకు కూడా విశ్రాంతినివ్వాలి. ఎందుకంటే శరీరం ఒకచోట ఉండి, మనసు మరోచోట తిరుగుతుంటే జీవితంలోని ఏ అనుభూతినీ పూర్తిగా ఆస్వాదించలేం. ప్రతి క్షణానికి దాని సమయాన్ని, ప్రాధాన్యతను ఇవ్వగలిగితేనే జీవితం మరింత అర్థవంతంగా, ఆనందంగా మారుతుంది. ఏం చేస్తున్నామన్నది కాదు.. చేస్తున్నప్పుడు ఎంతగా అందులో లీనమయ్యామన్నదే ముఖ్యం.

-మహాదేవ

వింతల్లో వింతలు

గోకించుకోవడానికీ ఓ సెలూన్



మసాజ్‌లు, స్పా సెంటర్లు చూసుంటారు.. కానీ గోకించుకునేందుకు ప్రత్యేకంగా సెలూన్లు ఉండటం ఎప్పుడైనా విన్నారా? చైనాకు చెందిన వ్యాపారవేత్త ఈ వింత ఆలోచనతో రెండు ప్రత్యేక సెలూన్లు ప్రారంభించాడు. ఒత్తిడితో సతమతమయ్యే కస్టమర్లు ఇక్కడికి వచ్చి సున్నితంగా గోకించుకుంటూ రిలాక్స్ అవుతారట. ఇందుకోసం ప్రత్యేకంగా డబ్బులు కూడా చెల్లిస్తారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే.. ఈ రెండు సెలూన్ల ద్వారా అతడు నెలకు 15 వేల యువాన్లకు పైగా సంపాదిస్తున్నాడట! ఇక్కడ గంట నేపు గోకించుకోవాలంటే సుమారు 300 యువాన్లు (రూ.4 వేలకుపైగా) చెల్లించాలి. సిబ్బంది ప్రత్యేకమైన ప్లాస్టిక్ గోళ్లతో వీపు, శరీరంపై మెల్లగా గోకుతారట. మసాజ్ కంటే ఇదే ఎక్కువ హాయినిస్తోందని కొందరు కస్టమర్లు చెబుతున్నారట. ఇప్పటికే ఈ వ్యాపారం లాభాల బాట పట్టడంతో దేశవ్యాప్తంగా మరో 100 సెలూన్లు ప్రారంభించాలని ఆ వ్యాపారవేత్త ప్లాన్ చేస్తున్నాడు. మసాజ్‌తో రిలాక్స్ అయ్యే రోజులు పోయాయేమో.. ఇప్పుడు గోకించుకుంటేనే హాయిగా ఉంటుందన్నమాట!

టెస్ట్ క్రికెట్‌లో ముష్ఫికర్ రహీం చరిత్ర.. తొలి బంగ్లా ఆటగాడిగా అరుదైన ఘనత

టెస్టుల్లో 7000 పరుగులు పూర్తి చేసిన తొలి బంగ్లాదేశ్ క్రికెటర్

వెస్టిండీస్‌తో రెండో టెస్టులో ఈ అరుదైన మైలురాయిని అందుకున్న ముష్ఫికర్

బంగ్లా తరఫున 5000, 6000 పరుగులు కూడా మొదట పూర్తి చేసింది ఇతనే

107 టెస్టులతో బంగ్లా తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగానూ రికార్డు



బంగ్లాదేశ్ సీనియర్ వికెట్ కీపర్-బ్యాటర్ ముష్ఫికర్ రహీం టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ ఫార్మాట్‌లో 7000 పరుగులు పూర్తి చేసిన తొలి బంగ్లాదేశ్ క్రికెటర్‌గా అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. వెస్టిండీస్‌తో సిల్హెట్ వేదికగా ఈరోజు ముగిసిన రెండో టెస్టు మ్యాచ్‌లో ముష్ఫికర్ ఈ మైలురాయిని చేరుకున్నాడు. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టుకు దూరంగా ఉన్న 39 ఏళ్ల ముష్ఫికర్, రెండో టెస్టులో బరిలోకి దిగాడు. మ్యాచ్ ప్రారంభానికి ముందు అతను 7000 పరుగుల మార్క్‌కు 43 పరుగుల దూరంలో ఉన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 34 పరుగులు చేసి అవుటయ్యాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో, మ్యాచ్ ఐదో రోజు ఆటలో భాగంగా రోస్టన్ చేజ్ బౌలింగ్‌లో ఒక సింగిల్ తీసి 9 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఈ చారిత్రక మైలురాయిని అందుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌లో మొత్తం 49 పరుగులు చేసి అతను నాటౌట్‌గా నిలిచాడు. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 369 పరుగుల లక్ష్య ఛేదనలో 184/4 స్కోరు వద్ద ఉండగా, వెలుతురు మందగించడంతో అంపైర్లు మ్యాచ్‌ను నిలిపివేశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. బంగ్లాదేశ్ తరఫున టెస్టుల్లో 5000, 6000 పరుగుల మైలురాళ్లను కూడా తొలుత అందుకున్నది ముష్ఫికర్ రహీమే కావడం విశేషం. ప్రస్తుతం 7000 పరుగులతో అగ్రస్థానంలో ఉన్న అతను, రెండో స్థానంలో ఉన్న మోమినుల్ హక్ (5293) కంటే 1747 పరుగులు, ఇప్పటికే రిటైరైన తమీమ్ ఇక్బాల్ (5134) కంటే 1906 పరుగులు అధిక్యంలో కొనసాగుతున్నాడు. 2005లో లార్డ్స్ మైదానంలో ఇంగ్లండ్‌పై టెస్టు అరంగేట్రం చేసిన ముష్ఫికర్ రహీం, బంగ్లాదేశ్ తరఫున అత్యధిక టెస్టులు ఆడిన ఆటగాడిగానూ రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు 107 టెస్టులు ఆడిన అతను, దేశం తరఫున 100 టెస్టులు పూర్తి చేసిన ఏకైక ఆటగాడు. ఇప్పటికే వన్డే, టీ20 ఫార్మాట్‌లకు వీడ్కోలు పలికిన ముష్ఫికర్, కేవలం టెస్ట్ క్రికెట్‌లో మాత్రమే బంగ్లాదేశ్‌కు తన సేవలు అందిస్తున్నాడు.

ఖవాజా చెప్పిందంతా నూటికి నూరు శాతం నిజం..

'శాండ్‌పేపర్ గేట్'పై నోరు విప్పిన వార్నర్



ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేసిన 2018 శాండ్‌పేపర్ గేట్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ ఘటనపై ఎనిమిదేళ్లుగా మౌనంగా ఉన్న ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్, ఎట్టకేలకు తన మౌనాన్ని వీడాడు. ఈ వివాదంపై ఇటీవల ఉస్మాన్ ఖవాజా చేసిన వ్యాఖ్యలకు పూర్తి మద్దతు ప్రకటించాడు. ఖవాజా చెప్పిందే నూటికి నూరు శాతం నిజమని, నిజానిజాలు బయటకు రావాల్సిన సమయం ఆసన్నమైందని వార్నర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను పంచుకున్నాడు. ఈ వివాదంపై అప్పట్లో జరిగిన విచారణ ప్రక్రియను వార్నర్ తీవ్రంగా తప్పుబట్టాడు. అది లోపభూయిష్టంగా, హడావుడిగా జరిగిందని ఆరోపించాడు. "ఈ అంశంపై మాట్లాడి ఎనిమిదేళ్లు అవుతోంది. ఉస్మాన్ ఖవాజాకు నా పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాను. నువ్వు చెప్పింది 100 శాతం నిజం. ఇప్పుడు అందరికీ నిజం తెలిసింది. ఎనిమిదేళ్ల తర్వాత ఎందుకు మాట్లాడుతున్నారని కొందరు ప్రశ్నిస్తున్నారు. కానీ ఇది ఉస్మాన్ కథ, అతను నమ్మిన విషయం. అప్పట్లో కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ పక్కనే ఉస్మాన్ కూర్చున్నాడు. కానీ అతడిని విచారించలేదు. ఇది ఎలాంటి సమగ్ర విచారణో నాకైతే అర్థం కావడం లేదు" అని వార్నర్ నిలదీశాడు.

ఈ వివాదం తన కుటుంబంపై చూపిన ప్రభావం గురించి వార్నర్ భావోద్వేగంగా మాట్లాడాడు. ఇటీవలే తన కుమార్తెలకు ఈ ఘటన గురించి వివరించాల్సి వచ్చిందని తెలిపాడు. "గత రెండు రోజులుగా నా కుమార్తెలకు అసలేం జరిగిందో వివరిస్తున్నాను. ముఖ్యంగా నా 12 ఏళ్ల కుమార్తె ఐవీ, అప్పట్లో మా చుట్టూ అన్ని కెమెరాలు ఎందుకున్నాయని, మేం టీవీలో ఎందుకు ఏడ్చామని అడిగింది. అది చెప్పడం చాలా కష్టంగా అనిపించింది. కానీ, 'అమ్మాయిలూ, ఎప్పుడూ నిజమే చెప్పండి, ఎందుకంటే అబద్ధాలు ఏదో ఒకరోజు బయటపడతాయి' అని వారికి చెప్పాను" అని వార్నర్ పేర్కొన్నాడు. ఈ కష్టకాలంలో తన కుటుంబంతో పాటు స్టీవ్ స్మిత్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ కుటుంబాలు కూడా ఎంతో నరకాన్ని అనుభవించాయని గుర్తుచేసుకున్నాడు. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్ సందర్భంగా శాండ్ పేపర్ తో బంతి ఆకారాన్ని మార్చేందుకు ప్రయత్నించిన ఘటన ఆస్ట్రేలియా క్రికెట్‌లో పెను దుమారం రేపింది. ఈ ఘటనలో స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ మాత్రమే దోషులని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) తేల్చింది. దీంతో స్మిత్, వార్నర్‌పై 12 నెలలు, బాన్‌క్రాఫ్ట్‌పై 9 నెలల నిషేధం విధించింది. కాగా, ఈ బాల్ ట్యాంపరింగ్ కుట్ర గురించి కేవలం ముగ్గురు ఆటగాళ్లకు మాత్రమే కాదని, పర్యటనలో ఉన్న జట్టు సభ్యులందరికీ ముందే తెలుసని ఖవాజా తెలిపాడు. "ఆ తప్పు మా అందరిదీ. కేవలం బ్యాటర్లు, బౌలర్లు లేదా సహాయక సిబ్బంది మాత్రమే కాదు.

స్పోర్ట్స్

ఒకవైపు గాయాలు.. మరోవైపు భారత్ జోరు.. కివీస్‌కు కఠిన పరీక్ష!



న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా మరో విజయానికి సిద్ధమైంది. ఇప్పటికే వరుసగా రెండు వన్డేల్లో గెలిచి 2-0తో ఆధిక్యంలో ఉన్న భారత జట్టు.. మంగళవారం జరిగే మూడో వన్డేలోనూ విజయం సాధించి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సొంతం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. హామిల్టన్‌లోని సెడ్డన్ పార్క్ వేదికగా జరగనున్న ఈ పోరులో ఆతిథ్య న్యూజిలాండ్‌కు మాత్రం చావోరేవో పరిస్థితి. ఈ మ్యాచ్‌లో ఓడితే సిరీస్ చేజారినట్లే. మరోవైపు కీలక ఆటగాళ్ల గాయాలతో కివీస్ సతమతమవుతోంది. ఈ పరిస్థితుల్లో సొంతగడ్డపై భారత్‌ను అడ్డుకోవడం శాంట్నర్ సేనకు పెద్ద సవాలే. ఈ సిరీస్‌లో భారత బౌలర్లే ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నారు. పేస్ దళం ధాటికి కివీస్ బ్యాటర్లు పరుగులు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. తొలి వన్డేలో 185 పరుగులకే కట్టడి కాగా.. రెండో మ్యాచ్‌లో 134 పరుగులకే కుప్పకూలింది. ముఖ్యంగా రెండో వన్డేలో గుర్నూర్ బ్రార్ 30 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. అన్షుల్ కాంబోజ్, అక్షర్ పటేల్ కూడా కీలక సమయాల్లో వికెట్లు తీసి ప్రత్యర్థిని దెబ్బకొట్టారు. ఈసారి కూడా ఇదే జోరు కొనసాగించాలని భారత్ భావిస్తోంది. మరోవైపు న్యూజిలాండ్ బ్యాటింగ్ విభాగం తీవ్ర ఒత్తిడిలో ఉంది. రెండో వన్డేలో డారిల్ మిచెల్ (55), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (31) మినహా మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేదు. టాప్ ఆర్డర్ విఫలమవుతుండటంతో మిడిలార్డర్‌పై భారం పెరుగుతోంది. విల్ యంగ్, హెన్రీ నికోల్స్, టామ్ లాథమ్, గ్లెన్ ఫిలిప్స్ ఈ మ్యాచ్‌లో బాధ్యత తీసుకోవాల్సి ఉంది. అయితే కివీస్‌కు మరో పెద్ద సమస్య గాయాలు. కుడి కాలి కండరాల గాయంతో సీనియర్ పేసర్ లాకీ ఫెర్గూసన్ చివరి రెండు వన్డేలకు దూరమయ్యాడు. రెండో మ్యాచ్‌లో హెల్మెట్‌కు బంతి తగలడంతో బ్లెయిర్ టిక్నర్ కూడా తదుపరి రెండు మ్యాచ్‌లు ఆడటం లేదు. అతడికి ఏడు రోజుల విశ్రాంతి తప్పనిసరి. దాంతో క్రిస్టియన్ క్లార్క్‌ను జట్టులోకి తీసుకున్నారు. దీంతో న్యూజిలాండ్ బౌలింగ్ విభాగం అనుభవలేమితో ఇబ్బంది పడే అవకాశముంది. భారత్ కూడా బ్యాటింగ్‌లో మెరుగుపడాల్సిన అవసరం ఉంది. తొలి వన్డేలో విరాట్ కోహ్లీ 74 పరుగులతో జట్టుకు అండగా నిలిచాడు. రెండో మ్యాచ్‌లో మాత్రం టాప్ ఆర్డర్ ఆశించిన స్థాయిలో రాణించలేదు. ఒక దశలో 113 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయిన భారత్‌ను కేఎల్ రాహుల్ అజేయంగా 26 పరుగులు చేసి ఆదుకున్నాడు. వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయే సమయానికి డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో భారత్ నాలుగు పరుగుల ఆధిక్యంలో ఉండటంతో విజయం దక్కింది. ఈసారి బ్యాటర్లు సమష్టిగా రాణిస్తే భారత్‌కు తిరుగుండదు. సొంతగడ్డపై ఆడుతున్న న్యూజిలాండ్ ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలని చూస్తోంది. టీ20 సిరీస్‌ను 2-3తో కోల్పోయిన కివీస్.. వన్డే సిరీస్‌లోనూ పరాభవం ఎదురుకాకుండా పోరాడాల్సిన పరిస్థితి. భారత బౌలర్ల జోరుకు కివీస్ బ్యాటర్లు అడ్డుకట్ట వేస్తారా? లేక గిల్ సేన మరో విజయంతో సిరీస్‌ను చేజిక్కించుకుంటుందా? అన్నది ఆసక్తికరం.



చిరంజీవి, బాలయ్య, వెంకటేష్, నాగార్జున కాంబోలో మూవీ రాబోతోందా?





గత కొన్ని సంవత్సరాల నుంచి వీళ్ళ నలుగురిని కలిపి సినిమా చేయడానికి చాలామంది దర్శకులు ప్రొడ్యూసర్లు ఆసక్తి చూపిస్తున్నప్పటికి అది కార్యరూపం దాల్చడం లేదు.

గత 4 దశాబ్దాలుగా తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తమకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకొని, తరాలు మారుతున్న బాక్సాఫీస్ వద్ద తిరుగులేని స్టార్లుగా వెలుగొందుతున్న నలుగురు దిగ్గజాలు చిరంజీవి,బాలయ్య, వెంకటేష్, నాగార్జున. ఇతర భాషల నుంచి ఎదురయ్యే పోటీని తట్టుకుని తెలుగు సినిమా ఇండస్ట్రీని ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర వహించారు. సీనియర్ హీరోలుగా గుర్తింపును సంపాదించుకున్న ఈ నలుగురు హీరోలు ఇండస్ట్రీలో ఉన్న స్టార్ హీరోలతో పోటీ పడుతున్నారు. ఇప్పటికీ వాళ్ల నుంచి వచ్చే సినిమాలు ఇండస్ట్రీ రికార్డులను బ్రేక్ చేయగలుగుతున్నాయి.

ైటర్లకి సవాలుగా మారిందా

త కొన్ని సంవత్సరాల నుంచి వీళ్ళ నలుగురిని కలిపి నిమా చేయడానికి చాలామంది దర్శకులు ప్రొడ్యూసర్లు సక్తి చూపిస్తున్నప్పటికి అది కార్యరూపం దాల్చడం లేదు. రణం ఏంటంటే ఈ నలుగురు ఇమేజ్ ను బ్యాలెన్స్ స్తూ ఒక కథని రాయడం అనేది అసాధ్యం. ఒకరి ్యారెక్టర్ కి ఇంపార్టెన్స్ పెరిగితే మరొకరి కి ప్రాధాన్యత గ్గిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి ఆ థను హ్యాండిల్ చేయడం చాలా కష్టంతో కూడుకున్న పని ఇప్పటికే చాలామంది రైటర్లు ప్రయత్నించి వదిలేసారు...

ఈ నలుగురిని కలిపే దర్శకులు ఉన్నారా?

ప్రస్తుతం ఇండస్ట్రీలో ఈ నలుగురితో సపరేట్ గా సినిమాలను చేస్తున్న దర్శకులు ఉన్నారు. కానీ వీళ్ళను కలిపి సినిమాలను చేయగలిగే దర్శకులు ఎవరున్నారు అనే దోరణిలో కొన్ని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలుగు సినిమా ఇండస్ట్రీలో రాజమౌళికి ఈ నలుగురిని హ్యాండిల్ చేసే కెపాసిటి ఉంది. కానీ ప్రస్తుతం ఆయన వరల్డ్ సినిమా స్థాయికి వెళ్తున్నాడు. కాబట్టి ఈ నలుగురితో సినిమా చేయడం కష్టమనే చెప్పాలి.

ఇక తమిళ్ సినిమా ఇండస్ట్రీ విషయానికి వస్తే రీసెంట్ గా 'జైలర్ 2' సినిమాతో సూపర్ సక్సెస్ ని సాధించిన నెల్సన్ కి సైతం ఈ నలుగురి ఇమేజ్ ను హ్యాండిల్ చేస్తూ సక్సెస్ ని సాధించగలిగే కెపాసిటి ఉంది. కానీ దానికి తగ్గట్టు కథ దొరకాలి. అలాంటి కథని కనుక రాసుకోగలిగితే మాత్రం నెల్సన్ ప్రతి ఒక్కరి ఇమేజ్ కి తగ్గట్టుగా వాళ్ళను డిఫరెంట్ స్టైల్ లో చూపించే ప్రయత్నం చేస్తాడు. జైలర్ 2 రజనీకాంత్ ను డిఫరెంట్ గా ప్రజెంట్ చేస్తూ, భారీ లెవెల్లో ఎలివేట్ చేస్తూ ప్రతి ఒక్కరిని మంత్రముగ్ధుల్ని చేశాడు...

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com